# లెక్కకల

ట్రెయిన్ ఒక గంట లేటుట, బ్రతికిపోయాము-కాని ఈ దేశంలో ఆ గంట రెండు గంటలుగా మారదన్న నమ్మకం యెక్కడుంది. రవి అంటుంటాడు. "అన్నిటికంటే పెద్ద అతిశయోక్తి రైల్వే టైమ్ టేబుల్" అని. చాలా నిజం. దేనికోసమైనా వెయిటింగ్ చాల దుర్భరమైన బాధ. ప్రతిక్షణం నిప్పులమీద కూర్చున్నట్లుగా ఉంటుంది—ఇట్స రియల్లీ హెల్.

రిస్టువాచీ చూసుకున్నాడు. తొమ్మిది గంటల అయిదు నిము షాలు. ఇంకా 55 నిముషాలు ఎదురు చూడాలి. యేదైనా పేపరు కొంటే కొంత టైమ్ గడపవచ్చునేమో. పుస్తకాల షాపుకేసి నడి చాడు. అన్ని పత్రికల్లో యేది కొనాలో తోచలేదు. అలా చూస్తూ నిల్చున్నాడు. అక్కడున్న పత్రికల ముఖ చిత్రాలు పతాక శీర్షికలు అన్నీ ఒకసారి చూశాక యే పేపరు కొనాలో నిర్ణయించుకోవాలి.

"ఏం కావాలిసార్" అన్నాడు షాపువాడు. ఆ ప్రశ్నలో చాలా అర్థాలు ధ్వనించాయి. యేదైనా కొంటే కొనండి లేకుంటే వెళ్ళిపొండి. ఒక్క పైసా కూడా ఖర్చుపెట్టకుండా ఇక్కడున్న యిన్ని పత్రికల వల్ల వచ్చేవినోదాన్ని దోచుకుపోతే మాకెంత అన్యాయం—నాన్‌సెన్స—వీడు మన గురించి యేమనుకుంటున్నాడో—డ్యామ్ పేపరు కొనలేని బాపతు అనుకుంటున్నాడేమో - నాస్టి ఫెలో. వీడికి తగిన శాస్తి చెయ్యాలి—

"జస్ట వెయిట్—పేపరు కొనడానికే వచ్చాను" ఇంతకీ యేం కొనాలో నిర్ణయించుకోలేదు. అదిగో ఎన్‌కౌంటర్—ఎన్—ఎన్‌కౌంటర్ కొంటే ఈ షాపువాడికి మనమంటే యేమిటో తెలిసివస్తుంది?

"ఆ ఎన్ కౌంటర్ యివ్వు"

నిర్లక్ష్యంగా ఐదు రూపాయల నోటు వాడి మొహాన పడేసాడు. ఇప్పుడు చూడు వాడి మొహంలో మనమంటే ఎంత గౌరవం యేర్పడిందో - వాడు చిల్లర యిస్తోంటె "ఫరవాలేదు ఉంచుకో" అనాలనిపించింది.

ఎన్ కౌంటర్ చేతిలోకి తీసికొని పేజీలు తిప్పసాగాడు— వాడిని యేడిపించాలని కొన్నామేగాని దీంట్లో ఒక్క పేజైనా చదవగలమా అని చాలా హెవీస్టఫ్ - ప్రయాణాలు చేసేటప్పుడు లైట్‌స్టఫ్ - కావాలంటాడు రవి. యే ముళ్ళపూడి వెంకటరమణ కథలో అయితే హాయిగా వుంటాయట.- రవికి కథలు, కవిత్వం అంటే పిచ్చి. పేజీలు తిప్ప సాగాడు. నో యూస్ బోయ్—ఇది చదవటం చాలా కష్టం—

సిగరెట్ త్రాగాలనిపించింది. జేబు తడుముకున్నాడు. అరె! సిగరెట్లు అయిపోయాయి—కొనుక్కోవటానికి బయల్దేరాడు. చాలా వండర్‌ఫుల్ థింగ్. ఈ రోజు ప్లాట్‌ఫారం మీద యెక్కువమంది లేరు. ట్రెయిన్‌లోకి క్షేమంగానే చేరే అవకాశాలు కన్పిస్తున్నాయి.

"ఒక హాఫ్ ప్యాకెట్ ఫోర్‌స్క్వేరు సిగరెట్లు యివ్వు."

"ఫోర్ స్క్వేర్ లేదు సార్ - బర్కిలీ ఉంది."

"వ్వాట్ నాన్‌సెన్స్! ఫోర్‌స్క్వేరు లేక పోవటమేమిటి - వరంగల్ కూడ ఉత్త పల్లెటూరు అయిపోయిందే.... ఒక బర్కిలి సిగరెట్ యివ్వు."

సిగరెట్ వెలిగించాడు. ఎందుకోగాని సిగిరెట్ త్రాగుతోంటే చాలా హాయిగా ఉంటుంది. నిజానికి ఫోర్‌స్క్వేర్ సిగిరెట్లకి బర్కిలీ సిగరెట్లకి అంత భేదం ఉన్నట్లనిపించదు. కాని తనకు మాత్రం ఫోర్‌స్క్వేర్ సిగిరెట్లే త్రాగాలని పిస్తుంది. "నువ్వు ఫోర్‌స్క్వేర్ సిగరెట్లనే త్రాగాలనుకోవటం ఉత్త వ్యానిటీ" అంటాడు రవి.

రవి యేం చేస్తున్నాడో యిప్పుడు, బాగా చదువుతుంటాడు. తనేమో యిలా తిరుగుతున్నాడు. హాస్టల్‌కి వెళ్ళటంతోటే బాగా చదవాలి. రవిని బీట్ చెయ్యాలి చాలా సీరియస్‌గా చదవాలి. గంటలకి గంటలు రాత్రులకి రాత్రులు .... చదివేసెయ్యాలి. యూనివర్శిటీ

ఫస్ట్ యిన్ ఫస్ట్ రావాలి. ఫస్ట్ యిన్ ఫస్ట్ వస్తే యే స్కాలర్‌షిప్పుతోనైనా స్టేట్స్‌కి వెళ్లొచ్చు. స్టేట్స్‌కి వెళ్ళాలని తనకి గాఢమైన కోరిక. మధురమైన స్వప్నం, కాని ఈ కల నిజమవుతుందా? పరీక్షలు యింకా నెలా పదిహేను రోజులున్నాయి. లాట్ ఆఫ్ టైమ్. చక్కగా చదివితే... రోజుకు ఎనిమిది గంటలైనా చదివితే తప్పకుండా యూనివర్శిటి ఫస్టు వస్తారు. తప్పకుండా చదువుతాను. ఈ నిర్ణయానికి తిరుగులేదు ఇప్పటికే చాలా టైమ్ వేస్టు చేశాడు. ఇక చేయబోడు రవి సినిమాలు తెగ చూస్తుంటాడు. ఇక తను అతనితో సినిమాకి వెళ్ళడు చదువుతాడు డే అండ్ నైట్ చదువుతాడు. యూనివర్శిటి ఫస్టు - యునైటెడ్ స్టేట్స్-ఎ గ్రేట్ ఫ్యూచర్.

వెనుకనుండి కలకలమని నవ్వులు వినిపించాయి. ప్రక్కకు తిరిగి చూసాడు. నలుగురు యువతులు చాలా హాయిగా నవ్వుకుంటూ వస్తు న్నారు. కాలేజి గరల్స్ లాగున్నారు ఇంతసేపటికిగాని ఈ ప్లాట్‌ఫారం కొంచెం లైవ్‌లీగా మారింది. ఆ నలుగుర్లో ఆ కాస్త లావున్న అమ్మాయి బావుంది-జయశ్రీ, జయలలితల్లాగ చాలా ఎగ్జిటింగ్‌గా, సెక్సీగా-రవి కైతే ఆ పెద్ద పెద్ద కళ్ళున్న ఆ సన్నటి అమ్మాయి నచ్చేది. అట్లాంటి అమ్మాయిల్ని చూస్తే అతనికి వెంటనే కవిత్వం వస్తుంది. ఆ విశాల నయనాల్లో నాకు యేవో దివ్యసుందర లోకాలు గోచరిస్తున్నాయి. అనేసే వాడు. రవి చాలా సెంటిమెంటల్-బాగా కవిత్వం పిచ్చి ఉంది. మనకి కవిత్వం అంటే పడదు చాలా సిల్లీగా ఉంటుంది. నీ ముఖం చంద్ర బింబంలాగుంటుంది అంటే నిజంగా ముఖం చంద్రబింబం లాగుంటే ఎంత ఘోరంగా ఉంటుందో-కొన్నిసార్లు ఈ కవుల ఊహలకి అర్థం పర్థం ఉండదు. బుర్రలో కొచ్చిన నానా చెత్తని కవిత్వం అంటారు. సెంటిమెంట్‌ని, హృదయ దౌర్బల్యాన్ని జీవితంమీద ఒక అన్‌రియలి స్టిక్ దృక్పథాన్ని కల్పించటంలో కవులు చాలా ప్రాముఖ్యం వహిస్తారు. ఐ హేట్ దెమ్-ప్లేటో చాలా గొప్పవాడు. తన ఐడియల్ స్టేట్‌లో కవు లకి స్థానంలేదు. పొమ్మన్నాడు.

"నాన్‌సెన్స్.... ఈ ఆలోచనల్లో పడి ఎదురుగా ఉన్న అందాన్ని, ఆనందాన్ని కోల్పోతున్నాను. నిజంగా ఆ లావాటి అమ్మాయి అందంగా

ఉందా ? నిజంగా చాలా ఎగ్జిటింగుగా ఉంది. ఎగ్జైటింగ్ అనే పదం తనకి యిష్టం. రియల్లి ఎగ్జైటింగ్.

"నువ్వు లావున్న వాళ్ళని లైక్ చెయ్యటానికి కారణం నువ్వు లావుండటం" అంటాడు రవి.

తనకి బాగా కోపం వచ్చింది. వెంటనే ఓ పెద్ద లెక్చరిచ్చాడు.

"నేను లావున్న వాళ్ళని లైక్ చేయటానికి కారణం నేను లావుండటం కాదు. ఆ వచ్చీరాని సైకాలజీ నామీద రుద్దకు. నా దరిలో సెక్స్‌కి, రక్తమాంసాలకి చాలా సంబంధం ఉంది. ఎందుకంటే మనిషి అంటే రక్తమాంసాలు. మీరు, మీ కవిత్వం ఘోషించే ఆ కళ్ళు, ముక్కు, చెవులు కాదు. కేవలం అందాన్ని కళ్ళలో తప్ప చూడలేక పోవటం మీకు ఆ కవిత్వం పట్ల ఉన్న వెర్రి వ్యామోహం. మీరు. మీ కవిత్వం. స్త్రీని వర్ణించే ఒక అందమైన వస్తువుగా చూస్తారు. ఎక్కడో ఎగ్జిబిషన్‌లో పెట్టి పూజించవలసిన వస్తువుగా - ఐ హేట్ టిట్ - స్త్రీలో నిజంగా మీ రక్తమాంసాలు కాంక్షించేది ఏదో తెలుసుకోలేకపోతు న్నారు. మీ కవిత్వం స్త్రీ అంటే కేవలం దూరం నుంచి చూసి ఆనందిం చాల్సిన వస్తువు అనే దృక్పథాన్ని కల్పిస్తున్నది. అందానికి సెక్స్‌కి ముడిపెడితే మీదృష్టిలో బూతు. కాని స్త్రీని నేనట్లా చూడను. స్త్రీ అందా నికి ఒక ప్రయోజనం వుంది. స్త్రీ అందం పురుషుడి రక్తమాంసాల్లో నిద్రిస్తున్న కోర్కెల్ని రగులుకొల్పాలి. అట్లా చెయ్యకపోతే ఆ అందం వ్యర్థం. ఒక స్త్రీనిచూచి పరవశమైపోవటం, కలలు గనటం, కవిత్వాలు వ్రాయటం వాటి జడత్వాన్ని చెప్తుంది. ఐ హేట్ టిట్ - స్త్రీని చూశాక పురుషుడు ఆ స్త్రీ మీద వాంఛతో కాలిపోవాలి. అతని రక్తమాంసాలు వేడెక్కి, వెర్రిగా, బాధగా, కాంక్షగా మూల్గాలి. ఆ స్త్రీకోసం వెంటనే అతడు హంట్ చెయ్యటం ప్రారంభించాలి." ఆ స్త్రీ అందం అతన్ని వెంటనే ఆ పనికి పురికొల్పాలి. అదే నిజమైన అందం అంటే....విశాల నేత్రాలు, చంద్రబింబంలాంటి ముఖం కాదు."

మన వాదనతో రవి హడలిపోయాడు. అలా మాట్లాడాడే కాని అలా చెయ్యగలడా ? ఇలా చెయ్యాలని ఎంత గాఢంగా ఫీలయ్యినా అలా నిజంగా చెయ్యటం ఎంత కష్టం - చాలా గట్స్ కావాలి.

ప్లాట్‌ఫారం మీద అలజడి ప్రారంభమైంది ట్రెయిన్ వచ్చే టైమైంది; సూట్‌కేస్ చేతిలో పట్టుకొని నిల్చున్నాడు. ఆ నలుగురు అమ్మాయిలు యే పెట్టెలోకి యెక్కితే ఆ పెట్టెలో యెక్కేద్దాం, చాలా ఎంటర్‌టైయింగ్‌గా ఉంటుంది. వీలైతే ఆ లావాటి అమ్మాయితో పరిచయం చేసుకోవచ్చు. రవి అంటే అలా కోపం వచ్చింది కాని తనకి లావున్న వాళ్ళంటే యిష్టమే. కాని రవి అన్నట్లు అందుకు కారణం తను లావుండటం, నిజమో కాదో చెప్పలేడు. పాపం పూర్ రవి. అప్పుడప్పుడు అతని గెస్సింగ్ నిజమే ఔతుంది. ఎందుకో మనని గురించిన నిజం వేరొకరి నోటినుంచి విన్నప్పుడు చాలా ఇరిటేటింగ్‌గా ఉంటుంది. అది కాదనటానికి యేదో థియరీలు చెప్పాల్సివస్తుంది. అందం మీద తను అంత లెక్చర్ యిచ్చింది తనలోని ఒకానొక బలహీనతని సమర్థించుకోవటానికే నేమో!

గంట కొడ్తున్నారు. దూరంగా ట్రెయిన్ కనిపించింది. కలకలం యెక్కువైంది. అదృష్టవశాత్తు ఈ రోజు ఎక్కువ మంది లేరు. ఆ నలుగురు యే పెట్టెలో యెక్కుతారా అని వాళ్ళకేసే చూస్తున్నాడు. సెక్స్ ప్రతిచోట సెక్సే. యెక్కడ ఏ అందమైన ముఖం కనిపిస్తుందోనన్న నిరంతరాన్వేషణ. రోజు రోజుకు ఈ సెక్స్ బాధ దుర్భరమౌతోంది. ఎడారి లాంటి బతుకు బతుకుతున్నాము. కనీసం యే అమ్మాయితోనైనా ఒకరాత్రి గడిపేఛాన్సు——యెప్పుడొస్తుందో?—యే అమెరికాలోనో అయితే డేటింగ్ సిస్టమ్ ఉండేది. ఆడవాళ్ళ – దాహం ఇంత తీవ్రంగా ఉండేది కాదు. ఎన్ని రాత్రుళ్ళు నిద్రలేని రాత్రుళ్ళు యేవో ఆలోచనలతో సెక్స్ బాధని మరింత ఉధృతం చేసికొని ఆ ఆలోచనలతోనే తృప్తిపడబోయి, విసిగి, వేసారి నిరాశ నిస్పృహలతో ప్రక్కమీద దొర్లి దొర్లి నిద్రపోయిన రాత్రులెన్నో? ట్రెయిన్ వచ్చి ఆగింది.

ఆ అమ్మాయిల దగ్గరకు వెళ్ళాడు ఆ లావాటి అమ్మాయి పమిట జారింది. ఎగ్జైటింగ్! బ్యూటీ అంటే అలా ఉండాలి—చచ్చాం—వాళ్ళు ఫస్టుక్లాస్‌లోకి యెక్కేస్తున్నారు. మనమూ ఫస్టుక్లాస్ టికెట్ తీసుకుంటే? చేతులు జేబులో ఉన్న పదిరూపాయల మీదకు వెళ్ళాయి. లాభంలేదు దారిద్ర్యం! ఈ దరిద్రం మనల్ని నోటు వదలదు—అసలు. డబ్బు

కోసమే ఇప్పుడు వరంగల్‌కి వచ్చింది. రెండు నెలలుగా హాస్టల్ ఫీజు కట్టలేదు. హాస్టల్‌నుండి వెళ్ళమన్నారు. కనీసం 200 రూపాయలైనా కావాలని యింటికొచ్చాడు. కాని ఇంటి దగ్గర మాత్రం డబ్బేది? డబ్బు కోసం నాన్న పడరాని పాట్లు పడుతున్నాడు. అప్పులతో కృంగిపోతున్నది తన కుటుంబం. ఇంటిపరిస్థితి అమ్మ వర్ణిస్తోంటే కన్నులకు నీళ్ళువచ్చాయి హృదయవిదారకమైన పరిస్థితి అది. తను ఎమ్ ఏ. చదివితే వాళ్ళ కష్టాలన్నీ గట్టెక్కుతాయని, వాళ్ళను ఆదుకొంటానని, వాళ్ళ జీవితాలని ఆనందమయం చేస్తానని తన చుట్టూ ఎన్ని ఆశాసౌధాలని నిర్మించుకుంటున్నారో! అందుకే వాళ్ళు పస్తులుండైనా తనకు డబ్బు పంపిస్తున్నారు. తనేమో ఆ డబ్బుతో ఫస్ట్‌క్లాస్ టికట్ కొనాలని ఆలోచిస్తున్నాడు. ఏమిటీ జ్ఞాపకాలు! ఇలాగే ఆలోచిస్తూ నిల్చుంటే ట్రెయిన్ కాస్త వెళ్ళిపోయేట్టుంది.... యేదో థర్డుక్లాసు పెట్టె చూసుకోవాలి. అయినా ట్రెయిన్‌లో ఈ క్లాసులేమిటి-నాన్‌సెన్స్-అదిగో ఆ పెట్టె కాస్త బావున్నట్టుంది. కిటికి ప్రక్క ఓ అమ్మాయి కూడా కూర్చుంది. ఎస్.... లెటజ్ గెట్ ఇంటు దిస్ కంపార్టుమెంట్....ఫరవాలేదు. ఖాళీగానే ఉంది. ఆ కిటికీ దగ్గర యింకో సీటు ఆమె ఎదురుగా కోర్చోవచ్చు-నాట్ బాడ్. ఆమె చదువుతున్న పుస్తకం నుండి తలెత్తి చూసి మళ్లా పుస్తకంలోకి కళ్ళని మరలించుకొంది. క్వైట్ యె బ్యూటీ. సీట్లో కూర్చొని నిట్టూర్చాడు. ఇవాళ నిజంగా అదృష్టవంతుడే తను. రైలు అంత ఆలస్యం కాలేదు. ఖాళీగా వచ్చింది చాలా మంచి సీటు దొరికింది. ఆమెకేసి పరీక్షగా చూశాడు. తను కోరే ఫ్లెష్ అండ్ బ్లెడ్ ఉన్న మనిషి. తన గాన్సెప్టన్ ఆఫ్ బ్యూటీకి బాగా సరిపోతుంది. గార్డు విజిల్ వినిపించింది....మరిచేపోయాడు – సిగరెట్లులేవు. అలా సిగరెట్లవాడు పోతున్నాడు. "ఏయ్" అంటూ కేకేశాడు; ఆమె కొంచెం చికాకుగా చూసింది.

"ఓ హాఫ్ ప్యాకెట్ ఫోర్‌స్క్వేర్ సిగిరెట్లు" అన్నాడు. ఫోర్‌స్క్వేర్ లేవని తెలిసినా అలా ఎందుకడిగాడో?

"ఫోర్‌స్క్వేర్ లేదు సార్-బర్క్లీ ఉంది."

"బర్క్లీ ఎవడికి కావాలోయ్ - ప్రతివాడు బర్కిలీ త్రాగేవాడే ఈ రోజుల్లో....పోనీలే....ఒక హాఫ్ ప్యాకెట్ బర్కిలీ" ట్రెయిన్ కది లింది. సిగిరెట్లు తీసికొని, డబ్బులిచ్చేసి సీట్లో కూర్చున్నాడు. ఈసారి ఆమె తనని పరీక్షగా చూడడం గమనించాడు

"నాన్‌సెన్స్....వరంగల్ కూడా ఉత్త పల్లెటూరు అయిపోయింది. ఫోర్‌స్క్వేర్ లేదట" స్వగతంగా అనుకున్నాడు. ఆమె వింతగా చూసింది—ఫన్నీ....ఇలాగే ఇంకాస్సేపు స్వగతం కొనసాగిస్తే పిచ్చి వాడనుకొంటుంది కాబోలు....ఫన్నీగా ఉంటుంది....కాస్సేపు పిచ్చివాడిలా యాక్టు చేస్తే యేం చేస్తుందో?

ఆమె అంత దీర్ఘంగా చదువుతున్న గ్రంథమేమిటో— గ్రంథం కాదే—కొంచెం పరీక్షగా చూశాడు. సినిమా రంగం లైట్‌స్టఫ్.... ఎన్‌కౌంటర్ కంటే నయమే—

ట్రెయిన్ వేగాన్ని అందుకొంటోంది. సిగిరెట్ త్రాగాలనిపించింది. కొంపదీసి అబ్‌జెక్టు చేస్తుందేమో. ఒకసారి తాను సిగిరెట్లు త్రాగని రోజుల్లో పక్కవాడు సిగిరెట్ త్రాగినందుకు వాడితో దెబ్బలాడిన గొడవ జ్ఞాపకం వస్తోంది. ఏమైనా పర్మిషన్ తీసుకోవటం బెటర్

"ఇఫ్ యు డోంట్ మైండ్ ఐ లైక్ టు స్మోక్" అనేశాడు. ఆమెకు ఇంగ్లీషు వచ్చో రాదో - ఆమె నుంచి ఎట్లాంటి రెస్పాన్సు రాలేదు. పోనీలే మన తప్పేమీలేదు. చెప్పేసాను.

సిగిరెట్ వెలిగించాడు గట్టిగా రెండుదమ్ములు లాగి పొగ వదిలాడు-చాలా హాయిగా ఫీలయ్యాడు. ఎంత వద్దనుకున్నా ఆమె ముఖం మీదికి పోకుండా ఉండలేను. వెంటనే ఆమె దస్తీతీసి ముఖానికి అడ్డం పెట్టుకొంది.

"ఐయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారి" సిగిరెట్ బయటకు పారేశాడు. ఎన్‌కౌంటర్‌తీసి చదువబోయాడు, పేజీలు తిరుగుతున్నాయే కాని వాక్యాల మీద దృష్టి నిలవటంలేదు

ఆడవాళ్లు ఏ విషయాన్నైనా సూచిస్తారేగాని వాచ్యంగా చెప్పరుట- ఈ "సినిమారంగం" చదువుతున్న యువతి నీ సిగిరెట్ కంపు భరించలేనని ఎంత అద్భుతంగా సూచించింది. సిగిరెట్ పోతే పోయిందిలే,

కాస్త మ్యానర్స్ తెలిసిన వాడనుకుంటుంది. కొంత గుడ్ విల్ క్రియేట్ ఔతుంది.

'ఎన్‌కౌంటర్' పేజీలు తిప్పసాగాడు. ట్రెయిన్ వేగంగా పరుగిడుతోంది. ఆమెకేసి మళ్ళీ ఒకసారి చూశాడు. నిజంగా అందంగా ఉందా? కాస్త లావున్నమాట నిజమే. కథలో బొద్దుగా ఉందని వర్ణిస్తారు ఇలాంటి వాళ్ళనే కాబోలు. రవి థియరీ ప్రకారం ఈమె నాకు వెంటనే నచ్చాలి. నిజానికి నచ్చకపోవటానికి ఏ కారణంలేదు. ట్రెయిన్ విసురుకి వస్తున్న గాలికి రేగి ఆమె అందమైన ముఖంతో దోబోచులాడుతున్న ఆమె నల్లటి కురులు....ఇరులలాంటి కురులు అబ్బో మనకి కూడా కవిత్వం వస్తోందే-నాన్‌సెన్స్ సహవాసదోషం. ఆమెను కవిత్వం లేకుండా చూద్దాం. ఆమె వెంట్రుకలు నల్లగా, అందంగా ఉన్నాయి. సింపిల్‌గా జడ వేసుకొంది. తల్లో పూలు లేవు. విశాలమైన నుదురు, బొట్టులేదు. ప్రయాణంలో చెరగి పోయుంటుందా? బొట్టు పెట్టుకోక పోవటం ఫాషనేమోలే కనుబొమ్మలు చక్కగా, తీర్చిదిద్దినట్లుగా వున్నాయి. చెంపకి చేరడేసి కళ్ళు కాకున్నా, ఏనుగ కళ్ళు మాత్రంకావు. కాటుక పెట్టుకున్నట్లు లేదు. అయినా అందంగా ఉన్నాయి. సన్నటి పొడవైన ముక్కు. ప్రొవోక్ చేసే పెదవులు, ఆవ్ ది హోల్ షి ఈజ్ బ్యూటిఫుల్. కాస్త నలుపైనా-రవికి ఎర్రటి వాళ్ళంటే ఇష్టం. ఆమె తనకేసి తీక్షణంగా చూడటం గమనించాడు. కనిపెట్టేసింది. తను ఆమెనే చూస్తున్నట్లు కనిపెట్టనీ ఏం చేస్తుంది. మిస్చిఫ్ చేస్తున్నాడని గార్డుని పిలుస్తుందా? పిలవనీ - ఫన్నీగా వుంటుంది.

మళ్లా కాస్సేపు 'ఎన్‌కౌంటర్' చూస్తున్నట్లు నటించాడు. పాపం తనను గూర్చి ఏమనుకుంటుందో-ఎవడో రౌడీ....తనను ఎత్తుకుపోయి నలిపేస్తాడని ...అదయినా బావుండేది. జీవితంలో కొంత థ్రిల్ వుండేది. నిజంగా ఈవిడని గమ్మత్తుగా మోసంచేసి, హైదరాబాదులో ఏ హోటలుకో తీసుకుపోయి ఈ నైట్ గడిపేసి....ఐడియా...జస్ట్ లెట్ మీ ట్రై...ఫన్నీగా వుంటుంది. సక్సెస్ అయితే ఎగ్జైటింగ్‌గా వుంటుంది. వ్వాట్ ఏ నాస్టీ ఐడియా, పోనీ జస్టు ఫర్ ది ఫన్ ఈమెతో

మాటల్లోకి దిగితే—ఎలా మాట్లాడించడం— "ఏమండీ! మిమ్మల్ని ఎక్కడో చూశాను జ్ఞాపకం రావటం లేదు"—ఇలా మొదలెడితే—వెనుక జన్మలో కాదుగదా? "మూగ మనసులు లోలా"— అంటే కొంత హ్యూమరస్‌గా కూడా ఉంటుంది. కంపార్టుమెంటులో మంది కూడ ఎక్కువలేరు. ఆమె ప్రక్కన కూర్చున్న ముసలామె కునికిపాట్లు పడ్తున్నది. దూరంగా కూర్చున్న వారంతా ఎవరి మాటల్లో వారు న్నారు. బోలెడు పైరివేసి ఉంది. నో స్టార్ట్ బోయ్—

ఆమె ఇంకా ఆ "సినిమారంగం" చదువుతోంది. రైలు వేగాన్ని తగ్గిస్తోంది. ఖాజీపేట వస్తున్నట్లుంది. కొంపదీసి ఈవిడ దిగిపోదుగదా—

ట్రెయిన్ ఆగింది. ఆమె కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఆమె దిగలేదు థాంక్ గాడ్. కాఫీకోసం కావచ్చు. ఐడియా—లెట్ మి హెల్ప్ హర్.

"ఏయ్ కాఫీ—గట్టిగా కేకేసాడు.

కాఫీవాడు వచ్చాడు.

"ఒక కాఫీ" అందామె.

"రెండు పట్రా" అనేసాడు.

వాడు ఏదో అర్థమైనట్లుగా ముఖం పెట్టాడు.

ఆమె కోపంగా చూసింది.

చెరో కాఫీ యిచ్చాడు. రెండు కాఫీలకీ తన డబ్బు లిచ్చాడు. ఆమె డబ్బు లివ్వబోయింది. "ఇట్స్ ఆల్ రైట్—డోంట్ మైండ్." సాధ్యమైనంత స్టైయిలిష్‌గా అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

సిగిరెట్లవాడిని చూస్తే సిగిరెట్లు త్రాగాలనిపించింది. ప్లాట్‌ఫాం మీదికి దిగి సిగిరెట్ వెలిగించాడు. ఎవరీ సినిమారంగం సుందరి? ఎక్కడకు వెడుతోంది. ఒకరై ఎంత నిర్భయంగా కాఫీ తీసికొంది. ఫర వాలేదు. సంభాషణ మొదలెడితే ఎలా రెస్పాన్స్ - బొతుందో - సీమ్స్ ఐ హోప్‌సన్ యు సమ్ వ్వేర్ అంటే. పాపం ఇంగ్లీషు వచ్చో రాదో. తెలుగులో స్టార్టు చెయ్యటమే సేఫ్. కంపార్టుమెంటు ఇంకా ఖాళీ అయింది. సిగరెట్ ఆర్పేసి ట్రెయిన్ ఎక్కాడు. సీట్లో కూర్చు

న్నాడు. ఆమె పుస్తకం మూసేసి ఏదో ఆలోచిస్తుంది. దిస్ ఈజ్ ది బెస్టు టైమ్.

"ఇఫ్ యూ డోంట్ మైండ్....మిమ్మల్ని ఒక విషయం అడుగు దామనుకుంటున్నాను". అమ్మయ్య – వాక్యం బయటకు వచ్చింది – మాట్లాడగలిగాడు. ఎలా రెస్పాన్స్ ఔతుందో!

"అడగండి".

వండర్‌ఫుల్....క్వైట్ ఎ గుడ్ గరల్.

"మిమ్మల్ని ఇదివరకు ఎక్కడో చూసినట్లుగా ఫీలౌతున్నాను. ఎక్కడో జ్ఞాపకం రావటంలేదు." కోసెయ్ నా రాజా కోసెయ్ .... ఆమె నవ్వింది. నవ్వినప్పుడు ఇంకా అందంగా కన్పించింది. ఎక్కడ అఫెండ్ ఔతుందో ననుకున్నాడు. నవ్వింది. ఇక ఫరవాలేదు.

"ఎక్కడ చూశానను కుంటున్నారు?" అందామె స్పష్టంగా. వ్వాట్ ఎ ప్లజంట్ వాయిస్. వెనుక జన్మలో అంటే....జోక్ సక్సెస్ ఔతుందా? సక్సెస్ కాదు బెడిసికొడుతుంది. "అదే జ్ఞాపకం రావటం లేదు. మెంటల్ బ్లెయిండ్ స్పాట్-" ఇంగ్లీషు ముక్కలు కొంత తగ్గించవోయి. నీ బోడి ఇంగ్లీషు ఆమెకు వచ్చో రాదో - నో నో - ఇంగ్లీషు ఉంటేనే ఆమె ఇంప్రెస్ అవుతుంది.

"ఎప్పుడైనా వరంగల్‌కి గాని, హైదరాబాద్‌కిగాని వచ్చారా?" అడిగాడు మళ్ళీ.

"లేదండి. మాది చాలా దూరం. గుంటూరు జిల్లా."

"ఎందుకో గాని కొంతమందిని చూస్తే వాళ్ళని యిదివఱకే ఎక్కడో చూసినట్లుగా, వాళ్ళు ఇదివఱకే మనకి చాలా సన్నిహితులై నట్లుగా ఫీల్ ఔతాము." గట్టిగా కోసెయ్యగల్గుతున్నాడు. మన మాటల్లో ఉన్న ధ్వని అర్థమౌతుందా?

చిన్నగా నవ్వింది! నవ్వినప్పుడల్లా ఒక వినూత్నమైన సౌందర్య మేదో ఆమెను ఆవరిస్తున్నది. చాలా ధైర్యం వచ్చింది.

మన మాటలోని ధ్వని అర్థమైనట్లు లేదు - పోనీలే – షి ఈజ్ నాట్ ఎ హార్డు నట్ టు క్రాక్, మనని ఒక రౌడీలాగ జమకట్టలేదు. నైస్ గరల్ - బట్ టాక్ సమ్ థింగ్. సంభాషణ తెగిపోనీయకు.

"ఎందాక వెళ్ళాలండి ?"

"చాలా దూరం వెళ్ళాలండి .... నిజామాబాద్ జిల్లాలో ఓ పల్లెటూరు."

"ఓ! క్వైట్ యెలాంగ్ జర్నీ....ఉత్తర ధృవం నుండి దక్షిణ ధృవం."

ఆమె నవ్వింది - మన చమత్కారం పనిచేస్తోంది - ట్రెయిన్ వేగంగా పరిగెత్తడం గమనించాడు—ఖాజీపేట స్టేషన్ విడిచి చాలా సేపైనట్లుందే....మనకి తెలియనే తెలియదు. వండర్ ఫుల్ .... గుంటూరు నుండి నిజామాబాద్ వెళ్ళాల్సిన అవసరమేమిటో .... డైరెక్ట్ క్వశ్చన్స్ ఆర్ బ్యాడ్ అట....ఇన్ డైరెక్ట్ క్వశ్చన్ ఆర్ సేఫ్....

"ఎవరైనా చుట్టాల్ని చూడటానికి వెళ్తున్నారా ?"

"లేదండి - అక్కడ ఉద్యోగం చేస్తున్నాను."

"ఐ సీ...." యేం ఉద్యోగం అని అడగాలనిపిస్తున్నది – డైరక్టు క్వశ్చన్ వద్దులే.

"అయితే మీరు సికింద్రాబాదులో ట్రెయిన్ మారాలన్న మాట."

"ఔనండి....నిజామాబాద్ వెళ్ళే ట్రెయిన్ క్యాచ్ చెయ్యాలి."

కొంచెం ఇంగ్లీషు తెలిసినట్లుందే... లేకపోతే క్యాచ్ అంటుందా .... క్యాచ్....ఏ ఫన్నీ వర్డు ...క్యాచ్ హరబోయ్ క్యాచ్ !

"నిజామాబాద్ నుంచి మళ్ళా యేదైనా క్యాచ్ చెయ్యాలా."

"యస్ .. ఓ బస్ క్యాచ్ చెయ్యాలి."

"అయితే మీరు ఈవినింగ్‌లోగా మీ డెస్టినేషన్ చేరగలరా ?"

"ఆ! ఇఫ్ ఎవ్రిథింగ్ గోస్‌రైట్....ఎనిమిది తొమ్మిది గంటల వరకు చేరవచ్చు."

"ఇఫ్ ఎవ్రిథింగ్ గోస్‌రైట్"....స్పష్టంగా ఇంగ్లీషు మాట్లాడేస్తోంది....కాని ఎంత డేర్ డెవిల్ .... గుంటూరు నుండి నిజామాబాద్ వరకు....ఒక్కతే....నిర్భయంగా....ఇన్ని రైళ్ళు మారుతూ.

డోన్టు థింక్ బోయ్....టాక్....టాక్—

"ఇఫ్ సమ్ థింగ్ గోస్ రాంగ్....చాలా కష్టపడతారేమో...."

"అఫ్‌కోర్స్"నవ్విందామె. తనూ నవ్వాడు - నిశ్శబ్దం. దూరంగా ట్రెయిన్ విజిల్ .... ఇంత సంభాషణ పొడిగించటం మనకి సాధ్యం కాదు....తను ఇన్ని ప్రశ్న లడిగాడు కదా....ఆమె తనని యేమీ అడ గదే....అదిగో మళ్లీ 'సినిమారంగం' తీస్తుంది....చచ్చాం....మళ్ళ ఒక గంట పేపటికి గాని తల యెత్తదు.

"మీ రెందాక వెళ్ళాలండి" అడిగింది....ఫైన్....

"హైదరాబాద్....నో నో....సికింద్రాబాదు."

"ఏదైనా ఉద్యోగమా...."

వాట్ నాన్‌సెన్స్ ఉద్యోగస్తునిలా కనిపిస్తున్నా-మనని ఎవరు చూసినా యూనివర్శిటీ స్టూడెంటు అని కళ్ళు మూసుకుని చెప్పేస్తారే-ఈవి డకి మనం ఉదోగస్తునిలా కనిపించామా ? షేమ్ బోయ్ షేమ్; ఒక సారి ముఖం అద్దంలో చూసుకోవాలని పిస్తోంది .... ఉద్యోగస్తునిలా మారిపోయానా ?

"నోనో....నాట్ ఇన్ ద లీస్ట్ .... ఐయామ్ ఎ స్టూడెంటు ఆఫ్ ఉస్మానియా యూనివర్శిటీ, ఎం. ఏ. చదువుతున్నాను." కాస్త గర్వం ధ్వనించినట్లుంది. మన జవాబులో........ఉత్త ఆర్రోగెంట్ ఫెలో అను కుంటుందేమో-జాగ్రత్త....

"ఓ—రియల్లీ....ఐయామ్ సారి" ఆశ్చర్యంగా కన్నులు పెద్దవి చేసింది....ఐ కుడ్ షాక్ హర్.

"చాలా లక్కీ-పీపుల్ మీరు" అందామె మళ్ళీ—

"ఏం—అలా అన్నారు" సాధ్యమైనంత ఆశ్చర్యాన్ని ధ్వనింప చేసాడు తన కంఠంలో.

"ఏ బాధ్యతలు బరువులు లేని కేర్ ఫ్రీ లైఫ్."

ఆమె జవాబు హాయిగా ఉంది. తనకి సిగరెట్ త్రాగాలని పించింది—వండర్‌ఫుల్ జర్నీ—మొత్తానికి సంభాషణ సాగుతోంది— ట్రెయిన్ వేగంగా పరుగెడుతోంది.

"యస్—ఏకేర్ ఫ్రి లైఫ్—హాయిగా వుంటుంది—మీరెప్పుడైనా యూనివర్శిటీ లైఫ్ ఎన్‌జాయ్ చేశారా?" డైరెక్టు క్వశ్చన్ — అఫెండ్ కాదుగదా—ఇంతవరకు బిల్డప్ చేసిన గుడ్‌విల్ నాశనం అయిపో

తుంది—నోనో—ఉత్త పుణ్యానికే అఫెండ్ అయ్యే వ్యక్తిలా కనిపించ టంలేదు—క్వైట్ యాన్ ఇంటరెస్టింగ్ గరల్—

"లేదండీ— అంత అదృష్టం లేకపోయింది."

"ఎంతవరకు చదివారండి" ఆసక్తిగా అడిగాడు.

"ఎస్. ఎస్. యల్. సి వరకు చదివానండి. కాలేజీలలో జాయిన్ అవాలని ఎంతో ప్రయత్నించాను. కాని పరిస్థితులు కలసిరాలేదు."కొంచెం బాధగా అంది.

"ఐసీ—అందుకేనా యూనివర్శిటీలో చదవడం చాలా అదృష్టం అంటున్నారు."

"యస్. యస్. యల్. సి చదివే రోజుల్లో కాలేజీని గూర్చి ఎన్నో కలలు కనేవాళ్ళం. అప్పుడు చదివిన నవలలు, కథలు, కాలేజీ అంటే ఒక "హెవెన్" అనే భావాన్ని కల్గించేవి. అందుకే కాలేజీ జీవితం నాలో ఒక స్వీట్ డ్రీమ్‌గా మిగిలిపోయింది."

క్రమక్రమంగా ఆమె దగ్గర బౌతోంది. షి ఈజ్ స్పీకింగ్ హర్ హార్టు నౌ. అప్పుడే ఇద్దరి మధ్య ఒక ఆత్మీయత లాంటిది ఏర్పడు తోంది... వండర్‌ఫుల్... వండర్‌ఫుల్ జర్నీ...బట్ టాక్ సమ్‌థింగ్... డోంట్ వేస్ట్ ఎ మినిట్...

"కాలేజీ అంటే అలాగే ఊహించుకుంటారు." నో యూజ్...కాస్త చమత్కారం జోడించవోయ్... యూజ్ యువర్ విట్స్...

"ఎం. ఏ. చదివాక ఏం చేద్దామను కుంటున్నారు."

"ఎం. ఏ. ఫస్టు క్లాసులో ప్యాస్ కావాలని ప్రయత్నం చేస్తున్నా నండి... ఒకవేళ ఆ కల నిజమైతే ఫారిన్ వెళ్ళాలని ఉంది- ముఖ్యంగా స్టేట్స్ చూడాలని ఉంది. యేహార్వర్డు యూనివర్శిటీలోనోరిసెర్చిచేయాలని ఉంది? మళ్ళీ కోతలు. ఆమె నమ్ముతుందంటావా... ఉత్తహంబక్... ఉత్త కోతలరాయుడు అనుకుంటుందేమో..,

"చాలా గొప్ప యాస్పిరేషన్స్ ఉన్నాయే మీకు."

ఆమె చాలా ఎడ్మైరింగ్‌గా చూస్తూ అంది. ఆమె కన్నుల్లో క్రొత్త ప్రకాశాన్ని చూశాడు. ఒకసారి కాలర్ సవరించుకోవాలని

పించింది. తనిప్పుడు ఆమె దృష్టిలో ఎంతో ఉన్నతుడుగా పెరిగి పోయాడు.

"రైలు వెర్రిగా పరుగిడుతోంది..."

"కేవలం ఆస్పిరేషన్స్ మాత్రమే" అన్నాడు... అలా అనటం ఎందుకో చాలా అన్ ప్లజంట్‌గానే ఉంది.

"అంత గొప్ప యాస్పిరేషన్స్ ఉండటం కూడా గొప్పతనమే. స్టేట్స్ అంటే హెవెన్‌కి మారు పేరనిపిస్తుంది... నిజంగా అక్కడికి వెళ్ళటం ఎంత థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్."

థ్రిల్లింగ్...థ్రిల్లింగ్ అనేమాట తనకి చాలా ఇష్టం..."థ్రిల్" ఆ మాటలోనే, ఆ సౌండులోనే ఎంత థ్రిల్ ఉంది...నిజంగా తన కిప్పుడు చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. స్టేట్స్‌మాట దేవుడెరుగు. చూస్తుండ గానే ఆమె తనకి ఎంత దగ్గరౌతోంది.. ఇంకా ఇంకా... ఆమెకి దగ్గరగా ... ఆమె హృదయం లోకి... ఆమె అంతరాంతరాల్లోకి. దగ్గరగా... ఇంకా దగ్గరగా వెళ్ళాలి. ఇదంతా రవితో చేప్తే... జెలసీతో చస్తాడు... రవి కేవలం కలల్లో బ్రతుకుతాడు... కాని తనిప్పుడు రవి లాంటివాడు కనే కలల్ని నిజం చేసుకుంటున్నాడు.

ట్రెయిన్ విసురికి వస్తున్న గాలికి ఆమె కురులు రేగి చిందర వందరగా ఆమె ముఖంమీద పడుతున్నాయి. వడ్డున పడి కొట్టుకుంటున్న చేప పిల్లలాగ ఆమె ఇంకా ఇంకా అందంగా కన్పించిం దతనికి...తల సవరించుకోవటానికి చేసే ప్రయత్నంలో పమిటకొంగు ఎగిరిపోయింది. యవ్వన విన్యాసం ఆమె అవయవాల్లో నాట్యం చేసింది. ఆమెని తన బిగి కౌగిట్లోకి అకస్మాత్తుగా తీసికొని ఉక్కిరి బిక్కిరి చేయా లనిపించింది. నరనరాల్లోను రక్తంపొంగి నిండుగా ప్రవహించింది. యేమిచేస్తుందో? అరుస్తుందా?...అంతా గుమిగూడుతారు. ఏం చెప్తుంది వాళ్ళతో? గార్డు వస్తాడు పోలీసులు తనని జైలుకి పట్టుకు పోతారు. థ్రిలింగ్...అదీ థ్రిలింగ్‌గానే ఉంటుంది. మరుపురాని అనుభవంగా స్థిరపరస్తుంది. ఏదో ఒక ఎడ్వంచర్ చేసేసినట్లుగా ఉంటుంది. జీవితం మరీ చప్పబడి పోయింది... థ్రిల్ లేదు.

ఆమె కొంగు సవరించుకొంటూ కాస్త సిగ్గు పడింది.

కాసేపు నిశ్శబ్దం. మళ్ళీ సంభాషణ ఎలా సాగించాలి. ప్రపంచములో ఎన్ని విషయాలు లేవు. తనకి ఏది జ్ఞాపకం రావటంలేదే. రవి అయితే సినిమాలు, రాజకీయాలు, కవిత్వం, డిటెక్టివ్ నవలలు, క్రికెట్ ఇట్లు ప్రతిదాన్ని గూర్చి ఒక గంట సేపైనా మాట్లాడగలడు. కాని ఏం లాభం. ఆడవాళ్ళ ముందు మాత్రం నోరు మెదపలేడు. తను ఇప్పుడు ఎన్ని మాటలు ఎంత హాయిగా, ఆహ్లాదంగా ఆమెతో మాట్లాడాడు. ఆమె దృష్టిలో తనిప్పుడు గొప్ప హీరో, స్టేట్ విజిట్ చేయబోతున్న అదృష్ట వంతుడు ఆమె మళ్ళీ సినిమా రంగం చదువుతోంది.

"ఐడియా మీకు సినిమాలంటే చాల ఇష్టం ఉన్నట్లుందే" అన్నాడు.

"ఏదో కాలక్షేపానికి... అప్పుడప్పుడు వెళ్తుంటాను."

"ఏవైనా ఇంగ్లీషు పిక్చర్స్ చూసారా!"

"లేదండి... తెలుగు సినిమాలు చూసాను కొన్ని."

"ఐ డోంట్ లైక్ దీజ్ తెలుగు పిక్చర్సండి! ఉత్త సెంటిమెంటల్ నాన్‌సెన్సు... ఏ ఇంగ్లీషు పిక్చర్‌కి వెళ్ళినా హాయిగా వుంటుంది మీ రసలే వక్కటికూడా ఇంగ్లీషు సినిమా చూడలేదా?"

"లేదండి...చాలా తక్కువ... హైదరాబాద్‌లో మా రెలెటివ్ ఒకామె వుంది... ఎప్పుడైనా ఆమెను చూడటానికి హైదరాబాద్ వెడితే చూస్తుంటాను ఇంగ్లీషు సినిమాలు."

ఐడియా...ఇంగ్లీషు సినిమాల గురించి అద్భుతంగా మాట్లాడ గలడు తను. జస్ట్ కంటిన్యూ దిస్ టాపిక్ బోయ్.

"ఏవేం ఇంగ్లీషు సినిమాలు చూసారండి."

"జ్ఞాపకం లేవండి. టెన్ కమాండ్‌మెంట్స్, బెన్‌హర్ చూసి నట్టు గుర్తు."

"బెన్‌హర్ చూసారన్నమాట. వండర్‌ఫుల్‌గా లేదూ? ఆ ఛారియేట్ రేసు చూడండి! ఎంత బ్రహ్మాండంగా తీసాడు. ఇట్ వజ్ సో థ్రిల్లింగ్‌కదు. మనవాళ్ళు అలాంటి సీనొకటి తియ్యటానికి వో సెంచరీ పోవాలి." ఆమె నవ్వింది చాలా ఇంటరెస్టింగ్‌గా వింటున్నట్లు కన్పించింది...యస్.గా ఎ హెడ్.

"ఆ పిచ్చర్లో హెస్టన్ అండ్ బాయిడ్ ఎంత అద్భుతంగా నటించారు."

"బాయిడ్ ఎవరండీ."

"స్టెఫెన్ బాయిడ్ తెలియదూ ! మెసాలా వేసినవాడు...అదే... విలన్."

"ఓహో...అతడా.. బాగా యాక్టు చేసాడండి."

"ఏమనుకున్నారు మరి ... హాలివుడ్ యాక్టర్సంతా అంతే. ఒక్కొక్కడు మహాయోధుడు చార్లటన్ హెస్టెన్, గ్రిగరీపెక్, రాక్ హడ్సన్, కర్క్‌డగ్లస్, సీన్‌కానరి రిచర్డెబర్టన్, పీటర్ వోటులే, టోని కర్టిస్" ఎన్‌సైక్లోపీడియా తెరచాడు. మన నాలెడ్జికి హడలిపోయింది. గొప్పగా ఇంప్రెస్ చేసాడు.

"అమ్మబాబోయ్...మీకు ఇంగ్లీషు సినిమాల్నిగూర్చి బాగా తెలుసే."

"అసలు తెలుగు సినిమాలు చూడనండి .." అన్నాడు గర్వంగా...

"ప్రతివారం ఏ ప్లాజాలోనో ఒక ఇంగ్లీషు పిక్చర్ చూడాల్సిందే..."

"అదృష్టవంతులు మీకేం." అందామె. ఈర్ష్యగా పూర్ గరల్. ఈ వయస్సులో ఏ మనలాంటివాడి ప్రక్కనో కూర్చొని ఏ "మైఫేర్ లేడీ"లాంటి ఇంగ్లీషు పిక్చరో ఎన్‌జాయ్ చేయాల్సింది. మారుమూల పల్లెటూర్లో మ్రగ్గిపోతోంది. ట్రాజెడి, ట్రెయిన్ వేగాన్ని తగ్గించింది. ఏదో స్టేషన్ వస్తున్నట్లుంది. జనగామ్ కావచ్చు... టైము చూసుకున్నాడు.

"ఒక గంటలో వచ్చేసాము ఫరవాలేదు. ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌ప్రెస్ లాగే పరుగిడుతోంది."

"సికింద్రాబాదు ఇంక ఎన్ని గంటల్లో చేరగలము." అడిగిందామె.

"ఇలాగేపోతే ఇంకా రెండు గంటల్లో చేరగలము."

ట్రెయిన్ స్టేషన్లో ఆగింది. కాఫీ త్రాగాలనిపించింది. రెండు మూడు సిగిరెట్లు పీల్చేయాలనిపించింది. ఇంకా ఏదో ఏదో చెయ్యాలని పించింది. గాలిలో ఎగరాలని పించింది. ప్లాట్‌ఫాం మీద ఆ సన్నని బండలమీద దొర్లాలనిపించింది. పిచ్చిగా కేకలు వేయాలనిపించింది.

'యాహూ' అని అరవాలనిపించింది. ఏదో ఇంకా ఏదో ఏమో చేసెయ్యాలనిపించింది. ఏమిటో మనస్సు ఇలా పరుగెత్తుతోంది. ఎ స్ట్రేంజ్ ఎక్స్‌పీరియన్స్.. వింత అనుభవం.

కాఫీవాడిని పిలిచాడు. రెండు కాఫీలు తెప్పించాడు. ఆమె వద్దంటున్నా ఆమెతో కాఫీ త్రాగించాడు అప్పుడే ఆమెమీద తనకేదో హక్కున్నట్లుగా ఫీలౌతున్నాడు. కంపార్టుమెంటులోకి కొత్తవాళ్ళు యెక్కారు. అంతా దిగిపోతే ఎవరూ లేకుండా తనూ ఆమెవుంటే యేమయ్యేదో తనేం చేసేవాడో గట్టిగా కౌగలించుకొని నలిపివేసేవాడు—ఎన్ని యుగాల దాహమో ఆమె పెదవులతో తీర్చుకొనేవాడు.

"ఏమండీ దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. యెవరైనా గర్ల్‌ఫ్రెండ్ గురించా?" చిలిపిగా అడిగింది. నవ్వుతూ అడిగింది. ఉలిక్కిపడ్డాడు. తను ఆలోచిస్తున్నది తన గురించేనని తెలిసికొని అలా అడిగిందా?

"యస్ గర్ల్‌ఫ్రెండ్ గురించే. ఆ గరల్‌ఫ్రెండ్ ఎవరోకాదు మీరే." అంటే ఏమంటుందో నో నో యూ ఫూల్ డోంట్ కమిట్ సచ్ ఎ మిస్టేక్ తనంటే ఒక నమ్మకం. ఒక ఆత్మీయత ఏర్పడింది. అది నాశనం కావటం యిష్టంలేదు. ఈ ప్రయాణం ఇలాగే సాగనీ ఇలాగే ఇలాగే నిరంతరం సాగిపోతే....

"అబ్బే నా కెవరూ గరల్ ఫ్రెండ్స్ లేరండి" జేబులో నుంచి సిగరెట్ పెట్టె తీసి "తాగొచ్చా" అన్నట్లుగా చూసాడు.

"ఫరవాలేదు—యు కెన్ స్మోక్" అంది నవ్వుతూ. రైలు కదిలింది. సిగరెట్ అంటించాడు. తనకేసి ఎడ్మైరింగ్‌గా చూస్తోంది. ప్రతి క్షణానికి ఆమెలో కొత్త అందాన్ని కొత్త వెలుగుని చూస్తున్నాడు.

"మీ క్లాసులో గరల్స్ లేరా" ఆసక్తిగా అడిగిందామె.

"ఎందుకులేరు బోలెడుమంది"

"మీతో సోషల్‌గా మూవ్‌కారా?"

"మీరేమన్నా అనండి. ఈ యూనివర్శిటీలో చదివేగరల్స్ అంటే నాకు చాలా అసహ్యం. ఎం. ఏ. చదువుతున్నామని మాకన్నా. అంద మైన వాళ్ళు ప్రపంచములో లేరన్నట్లు. ఎలిజిబెత్ టేలర్లో, సోఫియా లారెన్లో అయినట్లు ప్రతీ బోయ్ స్టూడెంటు వాళ్ళంటే పడి చస్తున్నట్లు బోలెడు గర్వం" ప్రతిమాట వత్తిపలుకుతున్నాడు.

"నిజంగా అందంగా ఉంటారా?" ముందుకు వంగి చాలా క్యూరి యస్‌గా అడిగింది.

"నీ ముందు అంతా దండుగే" అనా లనిపించింది.

"ఉండక ఏంచేస్తారు. లేటెస్టు ఫ్యాషన్స్‌తో, ట్రిమ్మ్‌గా, లైటుగా అలంకరించుకొని, మగవాడిని ఆకర్షించాలని ఎన్నో విధాలుగా తంటాలు పడ్తూ, వెకిలి చేష్టలన్నీ చేస్తుంటే—మగవాళ్ళని ఆకర్షించాలని ఒకవేపు ఉంటుంది. వాళ్ళ ఆకర్షణలకి ఎక్సైట్ అయ్యి ఎవడైనా ఏమైనా అంటే ప్రిన్సిపాల్‌కి రిపోర్టు చెయ్యటం వాళ్ళకి వెస్టరన్ పీపుల్‌ని అనుకరించ డమే తెలుసుకాని, వాళ్ళ మ్యానర్స్ తెలియదు. వాళ్ళలాగ బోయ్స్‌తో సోషల్‌గా మూవ్ కాలేరు. అయినా వాళ్ళ సబ్ కాన్షన్స్‌లో ఎప్పుడూ బోయ్స్‌మీద ధ్యాసే" ఆమె మామూలు కంటే చాలా ఆసక్తిగా వినటం గమనించాడు. కాని తను కొంచెం మితిమీరి మాట్లాడుతున్నాడేమో ఆడ వాళ్ళనుగూర్చి అలా మాట్లాడితే ఆమె ఏమనుకుంటుంది. తనిలా మాట్లాడడానికి తన క్లాస్‌మేట్ నళిని కారణం కాదుకదా? రెండుమూడు సార్లు నళినితో మాట్లాడబోయి ఫెయిల్ అయ్యాడు. దానికి చాలా గర్వం అదంటే తనకి అసహ్యం.

రైలు వేగాన్ని అందుకొంటోంది.

"ఇంకా ఎన్నిచోట్ల ఆగుతుందండీ" కిటికీలోంచే బయటకుచూస్తూ అడిగింది.

"ఎట్ వోన్లీ వన్ స్టేషన్....నెక్స్ట్ సికింద్రాబాదే" అన్నాడు.

"థాంక్ గాడ్" అందామె—

"ఏం? బోర్ అవుతున్నారా?"

"నో నో— త్వరగా వెడితే నిజామాబాద్ ట్రెయిన్ దొరక వచ్చునని"

"ఎన్నింటికి ఆ ట్రెయిన్?"

"రెండింటి కనుకుంటాను"

"రెండింటికైతే మీకు దొరకక పోవచ్చు. ఇపుడే పన్నెండు బౌతోంది"

"కరెక్టు టైమ్‌కి మన ట్రెయిన్స్ వెళ్ళవుగా కాస్త లేటు కాక పోతుందా"

"బౌననుకోండి"

ట్రెయిన్ వెర్రిగా పరిగిడుతోంది. ఇంకా రెండు గంటల్లో ఎవ్రీథింగ్ ఈజ్ గోయింగ్ టు బి ఎండెడ్ రెండుగంటల్లో ఈమెకి మనకి శాశ్వతంగా ఎడబాటు అంతే అంతేనా? దట్సాల్ ఈమెని ఒక్క-రోజు హైదరాబాదులో ఆపేయ గలిగితే...ఐడియా ఎలాగో— ప్లే సమ్ ట్రిక్—ఆపెయ్యగలిగితె ఆమె ట్రెయిన్ వెళ్ళిపోతే ఈట్రెయిన్ ఇంత వెర్రిగా పరుగెత్తకపోతే హైదరాబాదులో ఈమె కెవరో రిలేటివ్ వుందిట. ఆ రిలేటివ్ పేరు చెప్పి ఆపగలిగితే.

హైదరాబాదులో మీ కెవరో రిలేటివ్ ఉన్నారుకదా. ఈ రోజు వాళ్ళింట్లో వుండిపొండి. ఇప్పుడు హైదరాబాదులో ఎగ్జిబిషన్‌కూడా వుంది. ప్లాజాలో మంచి ఇంగ్లీషు పిక్చర్ వుంది. చాలా హాయిగా గడ పొచ్చు. రేపు పొద్దున్నే వెళ్ళిపోదురుగాని"

ఎస్ అంటే! ఎస్ అంటే ఒక్కమాట ఎంత ఎక్సైటింగ్‌గా గడపొచ్చు ఈ రోజుని.

"అంత అదృష్టం లేదండీ రేపు ప్రొద్దున నేను డ్యూటీలో జాయిన్ కావాలి. ఈ రోజు తప్పకుండా నా డెస్టినేషన్‌కు చేరాల్సిందే."

ఐడియా ఫెయిల్‌డ్—యే మిజరబుల్ ఫెయిల్యూర్—

"ఆ నిజామాబాదు ట్రెయిన్ వెళ్ళిపోతే యేం చేస్తారు?"

"మళ్ళీ నాల్గింటికి ఇంకో ట్రెయినుంది."

నాన్‌సెన్స్ ఒకే చోటికి యిన్ని ట్రెయిన్స్ ఎందుకు వేశారో— వెధవ రైల్వే డిపార్టుమెంట్—లేనిచోటికి లేనేలేవు.

"మరి మీరు నిజామాబాద్ నుంచి ఏదో బస్ క్యాచ్ చెయ్యా లేమో—అది మిస్సయితే" ఆశగా అడిగాడు— ఈ దెబ్బతో ఒప్పుకుం

టుంది. "ఆ బస్సులు చాలా ఉంటాయిలెండి— రాత్రి 9 గంటలకి లాస్టుబస్."

డ్యామ్ ది బసెస్—డ్యామ్ ది బ్రెయిన్స్—చాలా తలబిరుసు రకమున్నట్లుందే నేను ఉండమంటున్నాననైనా వప్పుకోదేం? ప్రపంచంలో యే శక్తి ఆమెను ఈ రోజు ఆపలేదు. ఇక రెండు గంటల్లో అంతా అంతం కాబోతుంది. రెండుగంటల్లో ఈమెవరో? తనెవరో? వ్వాట్ నాన్‌సెన్స్ ఈ సిల్లీథింగ్‌ని యింత సీరియస్‌గా తీసుకుంటున్నాను. కాంట్ యు టేక్ ఇట్ ఈజీ ఎ మియర్ ఫన్— సెంటిమెంట్ డెవలప్ ఔతున్నదే మనలోకూడా—— అయిపోతుందా? నిజంగా రెండు గంటల్లో అంతా అయిపోతుందా?— ఏమిటిది? అప్పుడే ఏదోబాధ- ఏస్వీట్ మెలాంఖలి! స్వీట్ మెలాంఖలి అనే పదం రవికి చాలా ఇష్టం— కిటికీలోంచి బయటకు చూస్తోంది. తనలాగే ఆమె ఫీలవుతుందా— లేక తనేనా? ఆమెకు అట్లాంటి ఫీలింగేలేదా? ఉంటే తను అంతగా హైదరాబాదులో ఈరోజు ఉండి పొమ్మంటే వప్పుకోదా? ఏమిటిది—అప్పుడే ఎందుకీ అనుబంధాన్ని పెంచుకొన్నాడు. సెంటిమెంటల్ నాన్‌సెన్సు రవిగాడి ప్రభావం.

"హైదరాబాదులో ఎక్కడ మీరుండేది?"

ఉన్నట్లుండి అడిగింది—యస్, ఆమెకూడా తనలాగే ఫీలౌతోంది! అందుకే తననుగూర్చి విడిపోయేలోగా ఇంకా ఇంకా తెలుసుకోవాలనే ప్రయత్నం చేస్తోంది.

"యూనివర్శిటీ హాస్టల్స్‌లోనండి."

"యూనివర్శిటీ హాస్టల్స్ చాలా బావుంటాయటగా?"

"చాలా బావుంటాయి! ముఖ్యంగా ఎ అండ్ బి హాస్టల్స్ చాలా బావుంటాయి. అసలు యూనివర్సిటీ క్యాంపసే చాలా బావుంటుంది. ఆర్ట్సుకాలేజి, లాండ్ స్కేప్‌గార్డెన్, న్యూ లైబ్రరీబిల్డింగ్—— అన్నీ చాలా బావుంటాయి.

"ఒకప్పుడు యూనివర్సిటీలో చదవాలని ఎంతగా కలలుగనేదాన్నో—కాలేజిగురించి స్నేహితులగూర్చి ఏవేవో ఊహాలోకాలు—కాని—" ఎంతో ఆత్మీయంగా, తన హృదయపు అంతరాంతరాలని తనకి

చెప్తోంది. ఆమె కలలని కన్నీళ్ళని, బాధల్ని, గాధల్ని తనతో చెప్పుకొని హృదయభారాన్ని తీర్చుకొని తనతో, తనలో ఐక్యమవాలనే ప్రయత్నమా అది?— ఇంకా ఇంకా దగ్గరికి తన హృదయంలోకి తన భావనాలోకంలోకి దూసుకుపోతున్నది— ఏమిటిది? రెండు గంటల్లో ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోతారు— ఎందుకీ వెర్రి మమకారం— ఎందుకీ వెర్రి ఆత్మీయత ఆమె ఇంకా ఏదో చెప్పుకోవాలని, ఏదో మాట్లాడాలని—తనకేసి—తనకోసం చూస్తోంది.

"కాని, ఆగారేం ? చెప్పండి."

"ఏముంది పాతకథే—మా కుటుంబం అంత డబ్బున్నది కాదు. ఎలాగో యస్. యస్. యల్. సి. వరకు చదివించారు. తర్వాత ఏదైనా ఉద్యోగం చూసుకోమన్నారు. అంతే—జీవితానికంతా ఒక మారుమూల పల్లెటూర్లో స్థిరపడిపోయాను."

ఆమె ముఖం వివర్ణమైంది. ఇంతసేపు ఎంతో ప్రయత్నంతో మాట్లాడినట్లనిపించింది. అప్పుడామెను చూస్తే, ఏడుస్తుందేమో ననిపించింది. ఏడిస్తే ఎలా ఓదార్చాలో తనకు తెలియదు. చాలా అడిక్క్యులస్‌గా ఫీలౌతాడు. థాంక్ గాడ్ — అల్లాంటిదేమీ చేయలేదు. ఇంకా ఎన్నో అడగాలనుకున్నాడు. కాని ఏమడిగితే ఏం ప్రమాదమో—పూర్ డామ్ "సెల్—డ్యామ్‌సెల్ ఇన్ డిస్ట్రెస్. మనమేదైనా సహాయంచేస్తే? ఏం సహాయం చెయ్యగలడు తను—పెళ్ళి చేసికొంటే — ఒప్పుకుంటుందా ? ఒప్పుకోక ఏం చేస్తుంది — పెళ్ళి అయిపోయిందేమొ నోనో ఆ లక్షణాలేమీ కనిపించటంలేదు. పెళ్ళి చేసుకుంటావా? ఇట్స్ టూమచ్. ఎం. ఏ. ఫస్టు క్లాస్ యునైటెడ్ స్టేట్స్ హార్వర్డు యూనివర్శిటీ అప్పుడు గాని పెళ్ళి; ఫన్నీగా ఉంటుందని సంభాషణ మొదలెట్టి ఈ వలయంలో చిక్కుపడిపోతున్నాడేమిటి ? ఈమెను పెళ్ళి చేసుకోవటమా ? నోనో. తనని అన్ని అప్పులుచేసి ఎందుకు చదివిస్తున్నాడు నాన్న. ఎవరో వేలకువేలిచ్చి పిల్లనిస్తారని. ఈమెను పెళ్ళి చేసుకున్నానని తెలిస్తే యింకేముంది హార్టుఫెయిల్ ! గుండె ఆగిపోతుంది. నాన్న గుండె ఆగిపోతే అమ్మ గుండె ఉంటుందా ! అమ్మ బాబోయ్ ! ట్రాజెడి—ఎ గ్రేట్ ట్రాజెడీ ఔతుంది.

ఆమె తేరుకుంది. కురుల్ని చీరెని సవరించుకొంటోంది, నలిగి పోయిన గులాబీ రంగు చీర, రేగిన కురులు గాలికి తొలగిపోతున్న పమిట—ఆమెనలా చూస్తోంటే కోరికలు విజృంభిస్తున్నాయి. నలిగి పోయిన గులాబిపువ్వు లాగుంది. పెళ్ళి చేసుకోంటే ఆ పువ్వు తన స్వంతం ఔతుంది—నలిపివెయ్యవచ్చు—అనుభవించవచ్చు—నరనరాల్లో రక్తం పొంగింది.

చేతిలో ఉన్న ఎన్‌కౌంటర్‌ని నలిపివేస్తున్నాడు. ఏదో పిచ్చి ఆవేశం తనని వశపరచుకుందోంది—తనని తను కంట్రోలు చేసుకోలేక పోతున్నాడు. ఏ క్షణంలో ఏం చేస్తాదో ?

"ఏమండీ ! మీ మ్యారేజి అయ్యిందా ?" చిలిపిగా అడిగింది.

ఏ ఫూలిష్ క్వెచ్చన్. తనని చూస్తే తెలియటం లేదా ? ఇంత చిన్న వయసులో మ్యారేజి చేసుకోవటమా ? నాన్ సెన్స్ మనని యింకా తెలుసుకోలేదు. పూర్ గరల్. ఇన్నోసెంట్ గరల్."

"లేదండి—నాట్ యెట్."

"ఆ అదృష్టవంతురా లెవరో" మళ్ళి అదే చిలిపితనం, ఎందుకలా మాట్లాడుతోంది ? ఎందుకు తన నలా రెచ్చగొడుతోంది ? తన నుండి ఏమి ఆశించి ఆమె అలా మాట్లాడుతోంది ? "మీరే" అంటే. సంతో షిస్తుందా ? ఆ సమాధానం కోసమే అలా అడిగిందా ! అప్పుడే తననుంచి అంత ఎక్స్‌పెక్ట్ చేస్తోందా ?

"ఇప్పుడిప్పుడే పెళ్ళి చేసుకొనే ఐడియా లేదండి. ఎం. ఏ. ఫస్టు క్లాసు—తర్వాత రిసర్చి. తర్వాత స్టేట్స్ అప్పుడుగాని పెళ్ళి—"

"ఇవన్నీ పెళ్ళిచేసికొని సాధించ లేరంటారా ? అడిగిందామె— ఇంకా ఇంకా దేనికోసమో పెనుగులాడుతోందామె. కాని నో యూజ్. ఐ కాంట్ హెల్ప్ ఇట్—

"నో—ఐ డోంట్ థింక్ సో. చాలా కష్టం. ఇట్స్ వెరీ డిఫికల్ట్."

ఆమె చాలా డిసప్పాయింటు అయినట్లుంది. ఏమీ మాట్లాడలేదు. సిగరెట్ వెలిగించాడు. పొగవదుల్తుంటే ఏవో ఎప్పుడూ చూడని లోకాల్ని చూస్తున్నట్లు, ఎప్పుడూ అనుభవించని వింత అనుభవాన్ని అనుభ

విస్తున్నట్లుగా ఫీలయ్యాడు. ఐ డోంట్ నో హౌ ఇట్స్ గోయింగ్ టు బి ఎండెడ్. ఎలా అంతమవబోతున్నదో! నిజంగా అంతమౌతుందా? గంటలు క్షణాల్లా గడుస్తున్నాయి. ఇంకో గంటలో, ఇంకో క్షణంలో అంతా అంతమై పోతుంది. ఈ ప్రయాణం ఇలా సాగితే ఇక్కడ నుంచి నిరంతరంలోకి — ఫ్రమ్ హియర్ టు ఎటర్నిటీ సూర్యుని చుట్టూ నవగ్రహాలు ఎలా నిరంతరం తిరుగుతున్నాయో, అలాగే ఈ ట్రెయిన్ భూమి చుట్టు ఎల్లప్పుడు తిరగ్గలిగితే—

"ఇంకో గంటలో సికింద్రాబాద్ చేరుకుంటామా?" అడిగిందామె. ఇంకో గంట — 60 నిముషాలు — అంతే. అంతా అంతం - భూమిని సూర్యుని చుట్టూ తిరగకుండా ఎవరూ ఆపలేరు. ఈ ట్రెయిన్‌ను సికింద్రాబాద్ చేరకుండా ఎవరూ ఆపలేరు. ఏదైనా యాక్సిడెంట్ అయితే?

"ఔను ఇంకో గంటలో చేరుకుంటాము—భోనగిర్ కూడా వచ్చేస్తోంది."

భోనగిరి స్టేషన్లో ట్రెయిన్ ఆగింది. మళ్ళీ సిగరెట్ వెలిగించాడు. ప్లాట్ ఫాంమీద గారెలవాడు కన్పించాడు.

"ఆకలి వెయ్యటంలేదూ? ఏమైనా తీసుకుంటారా!"

"అబ్బే—లేదండి ఏమీ అక్కర్లేదు."

ట్రెయిన్ కదిలింది. ఈ లోపలే ఏం మాట్లాడుకున్నా—ఇంత సేపు మాట్లాడిందంతా ఉత్త చెత్త. ఇంకేదో — ఇంకేదో ఈ చెత్త కానిది — మాట్లాడాలని ఉంది. ఎక్కడో హృదయపు అట్టడుగున ఉన్న ఏదో ఏదో ఈమెతో చెప్పుకోవాలని ఉంది. కాని ఎలా? గొంతు మూగపోతున్నది. మాట పెగిలిరాదు. "గుండె గొంతుకలో కొట్లాడుతుంది. కూర్చుండనీదురా కూసింతసేపు" ఎప్పుడూ రవి పాడుతుంటాడు. ఆ పాట—తనకు యిష్టం లేదని ఈసడించుకొనే కవిత్వం ఇలా తన గొంతులో ప్రవేశిస్తున్న దేమిటి?—

ట్రెయిన్ వేగాన్ని పుంజుకుంటోంది.

"ఇది జనవరి లాస్ట్ వీక్ కదా....మీ ఎగ్జామ్స్ దగ్గరకొస్తున్నాయనుకుంటాను. స్టడీస్ బాగా అవుతున్నాయా, అడిగిందామె. ఎగ్జామ్స్!—

ఉలికిపడ్డాడు. ఈ నాలుగైదుగంటలు ఎగ్జామ్స్‌ని పూర్తిగా మరచిపోయాడు. ఒక నెల రోజులుగా ఈ ఎగ్జామ్స్ భయపెడుతున్నాయి. ఔను — ఇది జనవరి లాస్టు వీక్, ఎగ్జామ్స్ వస్తున్నాయి దయ్యాల్లాగా—భూతాల్లాగా—బ్రహ్మరాక్షసుల్లాగ — సికింద్రాబాద్ స్టేషన్‌లాగ! ఈ ట్రెయిన్‌లా పరుగిడుతోంది కాలం—మార్చి వచ్చేస్తుంది. ఎవరూ ఆపలేరు. పరీక్షలనే జ్వాలల్లో పడి తను ఆహుతి ఐపోతాడు—లాభంలేదు. పుస్తకం తెరిచి చదవలేదు—ఆ మంటల్లో దూకి తనను తాను రక్షించుకునే సాధనాలని సృష్టించుకోవటంలేదు. వెధవ పరీక్షలు! ఈమెతో ఉన్న ఈ నాలుగు క్షణాలన్నా ఆ పీడ కలని మఱచిపోదాము.

"ఎగ్జామ్స్ అంటే నాకేం భయంలేదండి, ఐ నెవర్ కేర్ ఫర్ దీజ్ ఎగ్జామ్స్. ఈసారి ఫస్ట్ రాంక్ తేవాలనుకుంటున్నాను. అందుకని కాస్త సీరియస్‌గా చదువుదామనుకుంటున్నాను. యేమౌతుందో చెప్పలేను" సాధ్యమైనంత నిర్లక్ష్యంగా చెప్పాడు.

"ఏమౌతుందండి. మీకు తప్పకుండా రాంక్ వస్తుంది. ట్రై చెయ్యండి. ఐ విష్ యు గ్రాండ్ సక్సెస్ ఇన్ యువర్ ఎగ్జామ్స్" మేఘాలమీద తేలిపోతున్నట్లనిపించింది: శరీరమంతా నరనరాల్లో గొప్ప ఆనందమేదో ప్రవేశించినట్లుగా, ఓ దివ్యమైన రేయికన్న మధురస్వప్నం నిజమైనట్లుగా తనని విష్ చేసింది. ఈమె విష్‌ని నిజంచేస్తాడు. హాస్టల్‌కి వెళ్ళటంతోటే చదువుతాడు. డే అండ్ నైట్ పుస్తకాలని తినేస్తాడు. నిద్రాహారాలు మానేస్తాడు. ఎగ్జామినర్ హడలిపోయేలా రాస్తాడు. కుప్పలు తెప్పలుగా మార్కులు తన పేపర్ల మీద మార్కులవర్షం కురుస్తుంది. తన కల నిజమౌతుంది. యూనివర్శిటీ ప్రొఫెసర్లంతా తనని కంగ్రాచ్యులేట్ చేస్తారు. నళిని—నళిని కూడా తనని కంగ్రాచ్యులేట్ చేస్తుందా — తనే ఇంటెలిజెంట్ అని—తన ముందు ఎవడైనా దండగేననే గర్వంతో విర్ర వీగుతున్న—నళిని—జెలసీతో చస్తుంది ఈమె—ఈమె పేరేమిటో—పేరైనా తెలియదు; యేదో పేరు—

సుధ—నీరజ—సాధన—యేదో,

నాలుగు గంటలకు ముందు ఒక అపరిచితురాలు. ఇప్పుడు తన జీవితాన్నే మార్చేసేంత ప్రభావాన్ని సాధించింది. ఏమిటిది? ఫన్నీగా

ఉంటుందని జస్ట్ ఫర్ ఫన్ స్టార్టు చేసాను. ఇదంతా ఫన్నేనా? ఆమె విష్ చేసింది. థాంక్ చెయ్యటమే మఱచిపోతున్నాడు.

"థాంక్స్—థాంక్సండి. మీరువిష్ చేసాక—"ఏదో అనబోయాడు. అసహ్యంగా ఉంటుందని మానేశాడు.

ఆమె తేటగా నవ్వింది. కాస్సేపు ఇద్దరూ మాట్లాడలేదు......... నిశ్శబ్దం...ట్రెయిన్ చక్రాల చప్పుడు. తన గుండెల చప్పుడులాగ. ఎందుకో ట్రెయిన్ చప్పుడు చాలా భయంకరంగా ధ్వనించింది. ఈరోజు ట్రెయిన్ వెర్రిగా, వేగంగా పరిగిడుతోంది. యాక్సిడెంటు కాదు కదా.

"సికింద్రాబాదు దగ్గరౌతోంటే భయమేస్తోందండి" అందామె.

ఎందుకు — యస్ — ఆమెకూడ తనలాగే ఫీలౌతూంది. ఆమెకు కూడ ఈ ప్రయాణం ఎటర్నల్‌గా సాగాలనిపిస్తోంది.

"ఏం ఎందుకు?" అన్నాడు.

"సికింద్రాబాదులో ట్రెయిన్ మారటం అంటే నాకు చాల కన్ ఫ్యూజింగ్‌గా ఉంటుంది" అందామె.

"ఓ—అదా—"తన ఊహ నిజంకాదనే బాధ - కాని వెంటనే అన్నాడు.

"మిమ్మల్ని ట్రెయిన్ ఎక్కించాకే నేను హాస్టలుకి వెడతాను"

తను ఆమెకు సహాయం చేసే అవకాశం దొరికింది. ఏ గ్రేట్ ఆపర్చునిటీ.

"థాంక్సండి"

ఆమె కళ్ళు మెరిసాయి. కాని ఐడియా.. మళ్లీ ఒకసారి ఈమెని ఈరోజు హైద్రాబాద్‌లో ఆపటానికి ప్రయత్నం చేస్తే?—

"అసలు మీరో పని చేస్తే బావుంటుంది. ఈరోజు హైద్రాబాద్‌లో ఉండండి - రేపు ప్రొద్దున వెళ్ళిపోదురుగాని - మీకెవరో రెలిటివ్ కూడా ఉన్నారన్నారు?"

లాస్ట్ ఛాన్సు...ఈమె ఈరోజు హైద్రాబాద్‌లో ఉంటే... ఎగ్జిబిషన్...ప్లాజా థియేటర్...కళ్ళముందు వివిధ వర్ణాలతో ధగద్ధగాయమానంగా మెరుస్తున్నాయి. ఈ టెక్నికల నిజమౌతుందా— ఈమె ఉంటానంటె రిలేటివ్ ఇల్లేం ఖర్మ, ఏ తాజ్‌మహల్ హోటల్లోనో ఫస్టుక్లాసు

రూమ్ తీసుకుంటాడు...ఈరాత్రి మధురమైన రాత్రిగా... క్రొత్తలోకాల్ని చూపించిన రాత్రిగా మిగుల్తుంది. కాని ఒప్పుకుంటుందా...ఒక్కమాట... యస్—ఆల్ రైట్ ఆమె ఆలోచిస్తోంది తన ఆశ— తన కెక్కిళ్ల— ఆమె పెదవులకు వెనుకదాగి ఉంటుంది. ఏమౌతుంది? — చెప్పదేం—యస్ అనదేం??

"లేదండి. ఐ యామ్ నాట్ సో లక్కీ. ఇవ్వాళ తప్పకుండా వెళ్ళాలి. లేకపోతే ఈ ఉద్యోగం కాస్తా పోతుంది" బాధగా అంది.

డామ్ ది ఉద్యోగం. వెధవ ఉద్యోగం పోతేయేం? ఇట్లాంటి రాత్రి మళ్లీ వస్తుందా? తనకి వెధవ ఉద్యోగం. కాని ఆమెకది జీవన్మరణ సమస్య ఉద్యోగం పోతే నువ్విస్తావా? "వెధవ ఉద్యోగం పోతే పోయింది. నా కోసం—యస్...నా కోసం... ఈ రాత్రి ఆగిపోండి" అంటే ఒప్పుకుంటుందా?

"ఈ రాత్రికేనా...లేక"అని అడుగుతుంది. ఒకమాటలో బ్లంట్‌గా చెప్పాలంటే పెళ్ళి చేసుకోమంటుంది. పెళ్ళి చేసుకుంటానంటే ఈరాత్రి కేం. ఖర్మ జీవితమంతా నీతోనే నాన్ సెన్స్ — ఐ డోంట్ వాంట్ దట్—పెళ్ళి— కాళ్లు చేతులు కట్టి చెరసాలలో పడేయటం, బోనులో ఇరికించటం. తన కలలు, తన స్వేచ్ఛ, తన స్టేట్స్, అన్నీ కొట్టుకు పోతాయి. ఐ యామ్ నాట్ రెడీ ఫర్ దట్.

నిశ్శబ్దం – భారమైన నిశ్శబ్దం, గుండెల్ని చీల్చివేసే నిశ్శబ్దం-గుండెల మీద కుంపటిలా కూర్చున్న నిశ్శబ్దం— నిశ్శబ్దం కాదు—భయంకరం— క్రూరంగా, కర్కశంగా అరుస్తున్న బ్రెయిన్ డర్టీ బ్రెయిన్-కూలిపోతుందా? – అంతా చస్తారా? అదైనా బావుండేది. ఈ గొప్ప అనుభవం అంత అందంగా ముగిసేది.

ఆమె మళ్లీ కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఆమె ముఖం ఎందుకో చాలా విషాదంగా ఉన్నట్లనిపించింది. ఓ స్వీట్ మెలాంఖలీ ఆమె ముఖంలో కనిపిస్తుంది. స్వీట్ మెలాంఖలి. రవికి చాల ఇష్టమైన పదం. రవి ఏం చేస్తున్నాడో— బాగా చదువుతుంటాడు— చదవనీ. వెధవ పరీక్షలు— జీవితంలో ఎప్పుడైనా ఇంత గొప్పక్షణాలని అనుభవించగలడా? పరీక్షలు ఎన్నైనా ప్యాసుకావచ్చు.

"ఏమండి ట్రెయిన్ ఇవ్వాళ ఇంత వేగంగా పోతోంది."

"ఔను. డి వాస్టే టింగ్ స్పీడ్. ఎక్స్‌ప్రెస్ ఏమిటి— జి. టి. ఎక్స్‌ప్రెస్‌లాగ పోతోంది."

ట్రెయిన్ వేగంగా పోవటం ఈమెకి బాధగానేవుంది. ఆమె కూడ తనలా ఫీలౌతోంది. కాని నోరువిప్పి చెప్పుకోలేదు. మూగజీవులు. కాని ట్రెయిన్ సికింద్రాబాదు చేరేలోగానే ఏదైనా చేస్తే — లేక ఏదన్నా జరిగితే. ఐ విష్ సమ్ థింగ్ టు హాపెన్, ఫస్టుక్లాసు కంపార్టుమెంటు అయితే ఏమన్నా చేసేవాడు. కాని థర్డుక్లాసు అటూ ఇటూ మంది విలన్స్‌లాగ. నో యూజ్ — ఏమీ చెయ్యలేడు. నిస్సహాయుడు, అసమర్థుడు మాటలతో కోరికలు తీరుతాయా? ఓ గాడ్! ఏమిటీబాధ? ఏమిటీ అశాంతి. గాడ్‌మీద నమ్మకంలేని మనకి గాడ్ జ్ఞాపకం వస్తున్నాడు. ఈమెని ఈరోజు తనతో హైదరాబాదులో ఆపితే, ఆ గాడ్ ఏమి కావాలంటే అది ఇచ్చేవాడు. వంద కొబ్బరికాయలు — సిల్లీ — మరీ సిల్లీగా తయారవుతున్నావురా బ్రదర్.

"అయితే నాకు రెండు గంటల ట్రెయిన్ దొరకవచ్చు" అందామె.

మళ్లీ బాధే ధ్వనించింది ఆమె కంఠంలో. విడిపోతున్నామన్న బాధా? ఇంకోసారి ట్రై చేద్దామా—

"మీకు రెండు గంటల ట్రెయిన్ దొరక్కపోవచ్చు. అప్పుడేం చేస్తారు?"

"4 గంటలకి ఉందిగా మళ్లీ."

"4 గంటలకి సికిందరాబాదునుండి బయల్దేరితే మీరు మీ డెస్టినేషన్ చేరేటప్పటికి ఎంత రాత్రి ఔతుందో చూడండి. సికింద్రాబాద్ స్టేషన్లో పట్టపగలే భయపడ్తారే — 12 గంటల రాత్రి బస్సులో ప్రయాణం చెయ్యడమంటే — ఒక్కరూ ఎంత ప్రమాదమో ఆలోచించండి."

"రాత్రైనా పగలైనా వెళ్ళాల్సిందే. ఉద్యోగం అన్నాక అంతే"

వెధవ ఉద్యోగం — లాభం లేదు. — వెధవ ఉద్యోగం పోతే పోయింది. తనతో తనకోసం ఉండిపొమ్మని తను అడుగలేడు. ఆమె ఉండిపోదు. ఇద్దరిమధ్యా పెద్ద అఘాతం. బ్రిడ్జికట్టలేడు. అందుకు సంసిద్ధంగా లేడు. పోనీ ఇంకో ఐడియా. తనని ఆమె వెళ్ళే ఊరిదాకా

తోడు రమ్మంటే..., "ఊరిదాకా పంపించి వద్దురుగాని రండంటే" వెంటనే ఒప్పుకుంటాడు.

"చాలా రాత్రవుతుంది — భయపడ్తారు." సజెస్టివ్‌గా అన్నాడు.

"ఫరవాలేదండి ఎలాగో వెళ్తాను."

"రాత్రి - చీకటి — దీపాలున్న హైద్రాబాద్‌లాంటి సిటీలోనే మాలాంటి యువకులం అప్పుడప్పుడు భయపడ్తుంటాము. ఆ పల్లెటూర్లో అలా రాత్రి వెళ్ళటం ఎంత ప్రమాదం- జస్ట్ ఆలోచించండి" అన్నాడు. తనను రమ్మంటే ఆమెకి తోడుగా తనని రమ్మంటే- ఇప్పటికైనా అర్థంచేసుకొని రమ్మంటే...

"అబ్బే ఏమీ కాదండి- నాకిలా వెళ్ళడం అలవాటే. మీ రనవసరంగా భయపడ్తున్నారు."

వ్వాట్ ఎ డేర్ డెవిల్- ఆడదికాదు దయ్యం-రాక్షసి. 12 గంటల రాత్రి బస్సు దిగి దయ్యంలా నడచిపోతుందేమో. ఎవడి సహాయం అవసరంలేదు. తలబిరుసు. ఎవడైనా ఆ రాత్రి పట్టుకొని నలిపివేస్తే ఏం చేస్తుందో? అప్పుడుగాని తెలిసివస్తుంది. ఐ హేట్ దిస్ డేర్ డెవిల్ ఐ హేట్ విత్ ఆల్ మై హార్టు అండ్ సోల్. ఎంత చెప్పినా అర్థం చేసుకోదు. దయ్యంలా ఒక్కర్తే పోతానంటుందే కాని తనని రమ్మనదే? ఎందుకు రమ్మంటుంది? అలవాటేనట ఇలా వెళ్ళటం. ఎంత మందున్నారో ఆ ఊళ్ళో ఈమెగారి పరిరక్షకులు. అందుకే అంత ధైర్యం. అన్నీ సర్దుకొంటోంది. సికింద్రాబాద్ స్టేషన్ వస్తున్నది. ఏమీ జరుగలేదు. జరుగదు.

లేచి నిల్చుంది, పెట్టె క్రిందకి దింపుకుంటోంది. పీకెనొక్కెయ్యాలనిపించింది చేతులెత్తినపుడు పమిట జారింది. లేదు- ఆ యవ్వనాన్ని అనుభవించే అదృష్టం తనకులేదు. పమిట సర్దుకొనే ధ్యాసలోలేదు. ఆ పమిట పట్టి లాగితే?- తన ఒళ్ళోకి లాక్కుంటే?

"ఏమండీ, ఇంకా అలాగే కూర్చున్నారేమిటి- రెడీ అవ్వండి. సికింద్రాబాద్ స్టేషన్ వస్తోంది."

"నాదేముంది రెడీ అవటానికి - ఆడవాళ్ళకుంటాయి బోలెడు" కొంచెం కోపంగా అన్నాడు.

ఆమె నవ్వింది.

సికింద్రాబాద్ స్టేషన్‌లో ట్రెయిన్ ఆగింది - అంతే — దిగి పోవాల్సిందే. ఆమె చాలా త్వరపడుతోంది. గుండెలు బరు వెక్కు తున్నాయి.

"పై మెంతైందండి?"

"క్వార్టర్ పాస్ట్ టు."

"కాస్త తెలిసేటట్టు చెప్పండి బాబు."

"క్వార్టర్ పాస్ట్ టు అంటే తెలియదు?" ఎందుకో ఏడిపించాలని పించింది.

"నేను ఎం. ఏ. చదవలేదండి. పూర్ ఎస్. ఎస్. ఎల్. సి. ని పట్టుకొని ఎందుకు ఏడిపిస్తారు?"

"నో - నో రెండుంబావు."

ఏడిపించానా ? పమిట లాగనేలేదు - ఏడిపించానా ?

"అయితే నిజామాబాద్ ట్రెయిన్ ఉంటుందండి - ప్లీజ్ త్వరగా వెడదామండి."

"ఎస్" నిద్రనుంచి, గాఢ నిద్రనుంచి లేచినట్టుగా లేచాడు-

"ఏయ్ కూలీ" అంటూ కూలీని కేకేశాడు- "సామాను పట్రా" అన్నాడు. ట్రెయిన్ దిగారు.

ప్లాట్‌ఫారం మీద నడుస్తున్నారు. ఆమె పక్కన నడుస్తోంటే ఎంతహాయిగా ఉంది- తనకి మంచి మ్యాచ్ ఆమె- ఈడూ జోడు, దేవానంద్- సాధనల లాగ, కాని విడిపోతున్నారు. కొన్ని క్షణాల్లో-గుండెలు బరువెక్కుతున్నాయి. "గుండె గొంతుకలోన కొట్లాడుతోంది."

కవిత్వాన్ని తిట్టాను. ఐ వజ్ ఎ పూల్. మనిషిలోని గొప్ప ఎమోషన్స్‌ని కవిత్వం మాటల్లోకి అనువదించే ప్రయత్నం.

ప్లాట్‌ఫారం మీద ఒకచోట ఆగారు. కూలివాడికి డబ్బులిచ్చాడు.

"ట్రెయిన్ ఉందో వెళ్ళిందో కనుక్కొని వస్తాను" ఆమె నక్కడ వదిలాడు - నడుస్తున్నాడు - అడుగులు వేగంగా పడుతున్నాయి - గాలిలో తేలిపోతున్నాడు - ఎలా ? ఎలా ? ఎలా ? లాస్ట్‌ఛాన్స్ - ఆమెను ఆప గల్గితే—పోనీ తను ఆమెతో వెళ్ళగల్గితే-ఒక్కమాట "నాతో రాకూడదు"

అంటే...? రాదు - ఆ రాక్షసి గొంతులోంచి ఆ మాట రాదు. ఎంత రాత్రయినా దయ్యంలా పోగలదు - మగవాడి అవసరం లేదు- ఆడదన్న పుడు కాస్త భయపడాలి- పురుషుని సహాయం కోరాలి. అది సృష్టిలోనే ఉంది- లా ఆఫ్ నేచర్. కాని ఈవిడ దానికి వ్యతిరేకం. మగవాడితో అవసరమే లేదు రాక్షసి— సూర్యకాంతం !

గంటలు క్షణాలుగా మారాయి. అంతా ఐపోయింది. కొన్ని క్షణాల్లో ఆమె ఎవరో - తనెవరో, ఓ జ్ఞాపకం - ఓ మధురస్మృతి - ఎ స్వీటెస్టు సాంగ్ దట్ టెల్ ఎ సాడెస్టు స్టోరీ - ఈలైను రవికి చాలా ఇష్టం. ఆ మాటల్లో అర్థం ఇప్పుడు తెలిసివస్తున్నది. "ప్రతిదాన్ని సెంటిమెంటు అని తోసేస్తే జీవితానికిక మిగిలేది ఏమి ఉండదు" అనే వాడు రవి సెంటిమెంటు...ఇదంతా సెంటిమెంటేనా ?

స్టేషనంతా అల్లకల్లోలంగా ఉంది - తనలాగ, ప్రజలు, ఎక్కడ చూసినా ప్రజలు, ఎక్కడచూసినా ట్రెయిన్స్— కేకలు— అరుపులు- బ్లూ యూనిఫామ్.

"ఏయ్ నిజామాబాద్ వెళ్ళే ట్రెయిన్ వెళ్ళిపోయిందా ?" అడిగాడు.

"అదిగో- ఇంకా వెళ్ళలేదు- ప్లాటుఫారం నంబర్ సిక్స్ మీద రెడీగా ఉంది."

హెల్ విత్ ది ట్రైయిన్. రెండూ ఇరవై అయినా వెళ్ళలేదు. డర్టీట్రెయిన్. ఈ దేశం ఎప్పుడు బాగుపడ్తుందో ట్రెయిన్స్ సరిగ్గా టైమ్‌కి ఎప్పుడు వెళ్తాయో.

వెనక్కి తిరిగాడు ట్రెయిన్ వెళ్ళిపోయిందని అబద్ధమాడేస్తే ? ఐడియా, 4 గంటల వరకు గడపవచ్చు ! మీన్‌వైల్ ఈరోజు ఇక్కడే ఉండండని ఆమెని ఎలాగో వప్పించవచ్చు—యస్ అంతే చిన్న అబద్ధం విల్ డూ, ప్రపంచంలో ఎందరు ఎన్ని అబద్దాలు ఆడటంలేదు. తను ఒక అబద్ధం ఆడినంత మాత్రాన భూదేవి కృంగిపోతుందా చకచకా నడుస్తున్నాడు.

ఆమెతో చెట్టా పట్టాలేసుకొని ఎగ్జిబిషన్, ప్లాజా థియేటర్, తాజ్ మహల్ హోటల్ అందంగా అలంకరించిన గది. అంతకంటే అందంగా

మల్లెపూలదండలతో సినిమాల్లోలాగ అలంకరించబడిన బెడ్, బెడ్‌మీద తన కౌగిల్లో ఆమె.

ఎదురుగా వస్తున్న వాడికి డాష్ కొట్టాడు. తూలి పడబోయాడు. "కళ్ళు కన్పించటం లేదా" అంటున్నాడు వాడు. విన్పించుకోలేదు. మళ్ళీ వేగంగా నడుస్తున్నాడు. ఆమె లేచి నిల్చుంది. ఆతురతగా ఎదురు చూస్తోంది.

"ఏమండీ! ట్రెయిన్ ఉందిట నంబర్ సిక్స్ ప్లాట్‌ఫాం మీద" అంటోంది.

ఎవడో చెప్పేశాడు-తన టెక్నికలల బెలూన్ టాప్‌మని పగిలి పోయింది. ఎవరినో అడిగింది వాడు చెప్పేశాడు. సిగ్గూయెగ్గూలేని - స్త్రీ. స్త్రీకుండాల్సిన సిగ్గూ వినయం లేనేలేవు. పోనీయ్-ఐడోంట్ వాంట్ దిస్ మాస్కులైన్ వైఫ్ ఆఫ్ ఎ ఉమన్. పోతేపోనీయి, ఐడోంట్‌కేర్ ఎ పిన్.

"పదండి—పోదాం" అన్నాడు—

చుట్టూ చూసాడు—ఎవరూ కూలివాడు కన్పించలేదు. ఆమె పెట్టెని ఒక చేతిలోకి, తన సూట్‌కేస్‌ని ఒక చేతిలోకి తీసికున్నాడు. ఏం పెట్టిందో మహారాణిగారు. పెట్టెలో చాలా బరువుంది. ఈడ్చుకుంటూ నడుస్తున్నాడు. బ్యాగ్ చేతితో పట్టుకొని, ఆమె నడుస్తోంది. - ఎంత ఇన్‌సల్ట్ ఎప్పుడైనా పెట్టెలు మోశాడా తను? ఎవరైనా తనకి తెలిసిన వాళ్ళు చూస్తే! ఏమనుకుంటారు. తలయెత్తుకొని బ్రతకగలడా? వాట్ ఎ ఫాల్ బ్రదర్—ఎందుకీ త్యాగం; కరుణా, జాలి, ప్రేమ, సిగ్గూ, వినయం-ఇట్లాంటి వేవీలేని ఈ స్త్రీ కోసం ఎందుకీ వెర్రి. ఈ సమయంలో తనని ఆ నళిని చూస్తే ఫక్కున నవ్వుతుందేమో. చచ్చాం, ఆ బ్లూశారీ ఆ రెండుజడలు ఆ బల్కి ఫిగర్-నళిని కాదుకదా? కాదు? ఏమిటి! నళినే? క్లోజ్, రేపు క్లాసంతా మ్రోగిస్తుంది. రైల్వే పోర్టరుగా జాయిన్ అయ్యాడని చెప్తుంది. ఆమె పెట్టెని అలా రైలు పట్టాలమీదికి విసిరేద్దామనుకున్నాడు. ఎంత దిగజారిపోయావురా బ్రదర్. చివరకు రైల్వే పోర్టర్‌వి అయ్యావా? నో, నో—షి ఈజ్ నాట్ నళిని. థాంక్

గాడ్, బ్రతికిపోయాము. యస్-నంబర్ సిక్స్ ప్లాట్‌ఫారం- ట్రెయిన్ రెడీగా ఉంది.

"అదిగో ఆ కంపార్టుమెంటు ఖాళీగా ఉంది-దాంట్లోకి యెక్కుతాను" అప్పుడే కంపార్టుమెంటు కూడ వెతుక్కున్నది. డేర్ డెవిల్, మగవాడి అవసరమేలేదు. ఐహేట్ హర్.

"అది ఆడవాళ్ళ పెట్టె కాదు- ఆడవాళ్ళ పెట్టెలోకి ఎక్కండి" అన్నాడు.

"ఆడవాళ్ళ పెట్టెలు రష్‌గా అసహ్యంగా ఉంటాయి. ఈ పెట్టెలోకి యెక్కుతాను" అందామె-మగవాడి పెట్టే కావాలిట? పెట్టెలోకి యెక్కి- కిటికీ దగ్గరవచ్చి కూర్చుంది. పెట్టె అందించాడు-చెమటతో శరీరమంతా తడిసిపోయింది. చేతులు నొప్పిపుడ్తున్నాయి. పోనీలే పూర్‌గరల్ క్షేమంగా ట్రెయిన్ యెక్కించాను. ఎప్పుడైనా జ్ఞాపకం చేసుకోకపోతుందా?

"వోగాడ్ — నేను టికట్ తీసుకో లేదండి" అందామె కంగారుగా.

"టికెట్ తీసికోలేదు! ఆల్‌రైట్ నేను తెస్తానుండండి" వెనక్కి తిరిగాడు ఇప్పుడైనా—రెండు "టిక్కెట్లుతెండి" అనకూడదు? డేర్‌డెవిల్ ఎందుకంటుంది.

"ఏమండి మనీ తీసికెళ్ళండి" అంటోంది. వినిపించుకోలేదు. వేగంగా నడుస్తున్నాడు-తాను వచ్చేలోగా ఈ ట్రెయిన్ వెళ్ళిపోతే-పాపం ఎంతకష్టపడ్తుందామె ఏ టి. సి. గాడో టికెటు లేదని అందుకు ఫలితంగా ఆమెనేమైనా చేస్తే భరించలేడు. ఆమెకంత అవమానం జరుగుతుందా పూర్‌గరల్ వెధవ టి సి. గాండ్లు ఏమైనా చేస్తారు. శరీరం గగుర్పొడిచింది. పరుగెత్తు తున్నాడు- తేలిపోతున్నాడు. తూలిపోతున్నాడు. ఎదురుగా వచ్చేవాళ్ళని తప్పించుకుంటూ ఉరుకుతున్నాడు. ఏ మహత్తరశక్తి తన నిలా కదలిస్తోందో తెలియదు. గేటుదగ్గర "టికెటు" అంటున్న తెల్ల యూనిఫామ్‌వాడి మాటకూడ వినిపించుకోలేదు.

కౌంటర్ దగ్గరికు వెళ్ళాడు.

"వన్ టికెట్. నిజామాబాదు క్విక్ ప్లీజ్" పదిరూపాయలనోటు పడేసాడు. టికెట్, చిల్లర తీసుకున్నాడు-తిరిగి వస్తుంటే పళ్ళదుకాణం కనిపించింది. పాపం ఎప్పుడు తిని బయల్దేరిందో! అకలేస్తుంటుంది. పళ్ళు తీసికెడితే?

"నాలుగు ఆపిల్స్, ఒక డజను అరటి పళ్ళు క్విక్" అన్నాడు ఫూల్ ఆలస్యం చేస్తున్నావు ట్రెయిన్ పోతుంది. విలన్‌గాడు టి. సి. గాడు—ఆమెను నోనో అలా జరగటానికి వీల్లేదు. పండ్లప్యాకెట్ తీసుకొని డబ్బులిచ్చి మళ్ళీ పరుగు చెమటతో స్నానం చేస్తున్నాడు. వేసుకొన్న సూట్ చిందరవందర అయిపోయింది. తన నెవరైనా చూస్తే ఎవరైనా చూడనీ ఐడోంట్ కేర్ ఎ పిన్, ఫర్ గరల్ ఐ వాంట్ టు హెల్ప్! దట్సాల్.

వచ్చేశాడు నంబర్ సిక్స్ ప్లాట్‌ఫాంమీదకి. ఐ యామ్ నాట్ టూ లేట్.

ట్రెయిన్ ఉంది. తనకోసమే ఆతురతగా చూస్తోంది. తహతహలాడుతూ తపించిపోతూ, జాలిగా, బాధగా, నిస్సహాయంగా, ఆ చూపు కోసమే తన రాకకోసం అలా ఎదురుచూసే వాళ్ళుంటే ఏమైనా చేస్తాడు.

తనని చూసిన ఆమెకళ్లు మెరిశాయి టికెట్ యిచ్చాడు.

"థ్యాక్సండీ" అంటోంది, పళ్ళప్యాకెట్ యిచ్చాడు.

"ఇదేమిటి ఫ్రూట్సా. ఓ థ్యాక్సండి ఆకలిగా కూడా ఉంది." కృతజ్ఞత నిండిన కళ్ళతో చూసింది.

తను మాట్లాడలేక పోతున్నాడు. వగరుస్తున్నాడు - చెమటతో పూర్తిగా తడిసిపోయాడు. ఏం మాట్లాడాలో తెలియదు — స్తంభించి పోయాడు. బుర్ర.... అయిపోయింది, కరిమింగిన వెలగపండు.

ఆమె డబ్బివ్వబోతోంది-నాన్‌సెన్స్ ఏమిటిది ఏదో అనాలి- ఆమె దగ్గర్నుంచి డబ్బు తీసుకోవటమా? "నో నో ప్లీజ్। కీపిట్ ఐ సే"

గట్టిగా ఆజ్ఞాపిస్తున్నట్లుగా అన్నాడు.

"వో గాడ్ మీ హెల్ప్‌ని ఎంతని థ్యాంక్ చెయ్యను?" అంటోం దామె; తనకే అర్థం కావటం లేదు.

"ఏమండీ మీ అడ్రస్ చెప్పరా?" అందామె- అడ్రస్! లెటర్స్ రాస్తుందా? లవ్ లెటర్స్ — వండర్ ఫుల్! ఈ అనుభవం యిలా అంత మౌతుందనుకున్నాడు - కాని కాదు, నైస్ గరల్! సూట్‌కేస్ తీశాడు.

"మీ అడ్రస్ చెప్పండి మొదట" అన్నాడు—

"నా అడ్రస్ రెడీగా వుంది. మీ అడ్రస్" అందామె ఉత్సాహంగా- రాస్తున్నాడు. మిష్టర్ రమేష్, ఏ-68 ఓ. ఏ. హాస్టల్, హైదరాబాద్-7 ఆమె చేతికిచ్చాడు-ఆమె తన అడ్రసు యిచ్చింది. ఆమె పేరు తెలుసు కోవాలని ఈ నాలుగ్గంటలు తహ తహ లాడాడు. ఆమె పేరు—

"మిస్ మేరీ టీచర్" ఇక కన్పించలేదు. మేరీ— అంటే క్రిష్టియనా? సుధ, సాధన, జ్యోతి, సరళ, నీరజ— ఇట్లాంటి పేర్లేవో ఊహించాడు. కాని మేరీ! క్రిష్టియనా! మేరీ? క్రిష్టియనా? మళ్ళా ఒకసారి తన రెక్కలకలల బెలూన్ టాప్‌మని పగిలిపోయినట్లు, ఏదో ఆనందపు శిఖరం నుండి అగాధంలో పడిపోయినట్లు ఇంతసేపు తెలియని ఏదో రహస్యం తెలిసినట్లు— ఇంతసేపు అనుభవించిన అమృత ఘడియ లకి తనకి అర్థంకాని కొత్త అర్థాలు అన్పిస్తున్నాయి- ఏమిటిది? ఏమిటీ ఫీలింగ్? ఏమిటా రహస్యం? తనకేం తెలిసింది? తనకేమీ తెలియటం లేద్దు-తనిలా అయిపోతున్నా డేమిటి? ఆమె వెళ్ళిపోతుంది.

ఆఖరు క్షణాలు ఏదో మాట్లాడాలి- ఏదో ఏదో—యింకేదో ఆమెకి చెప్పుకోవాలి. ఆమె తనని నిరంతరం జ్ఞాపకం చేసుకునేలా, ఏదో తన హృదయాంతరాళాల్లో మెదుల్తున్న ఫీలింగ్స్‌ని ఆమెకు చెప్పుకోవాలి. కాని తనిలా ఐపోతున్నా డేమిటి - అచేతనుడిలా గొంతు పెగలదు— మాట రాదు.

"మిష్టర్ రమేష్ చాలా నైస్‌నేమ్ మీది. ఐ లైకిట్ వెరీమచ్ - మిష్టర్ రమేష్ ఎ ఫైన్ నేమ్ రియల్లీ" అంటోందామె. కాని తన హృదయం ఆనందంతో పరవళ్లు తొక్కడంలేదు. ఆమె ఆనందం తనకి భరించరానిదిగా తయారౌతున్నది. ఆమె నలా చూస్తోంటే ఏదో వెర్రి ఈర్ష్య. ఆమె నేదైనా చెయ్యాలనే కసి జనిస్తున్నాయి—

గార్డు విజిల్ కర్కశంగా. కసిగా, కటువుగా, క్రూరంగా వినిపించింది. ఉలిక్కిపడ్డాడు. మేరీ పోతుందిక ప్రపంచంలో యెవ్వరూ ఆప లేరు. తనేదైనా మాట్లాడాలి - ఎలా?

"మీరు క్రిష్టియనా?" అడిగేశాడు అప్రయత్నంగా, తన గొంతు తనదేనా? అనిపించింది. ఎందు కడిగా డలా? ఆమె బాధపడితే? జాతి, మత, కులాలతో నాకు ప్రమేయం లేదు. మనిషిని మనిషిలా చూడాలని గట్టిగా వాదించే తను అలా అడగటమా? వాట్ ఏ ఫూల్.

"ఎస్— ఏం?" అందామె.

"అబ్బే యేంలేదు మీరలా కన్పించలేదు- ఐ కుడ్‌నాట్ గెస్సిట్" అన్నాడు. ఏదో తప్పు చేశానన్న బాధ ధ్వనిస్తోంది తన మాటలో.

"అఫ్‌కోర్స్— ఐ యామ్ నాట్ ఏ క్రిష్టియన్ - బై బర్త్ అను కోండి-" అంటోందామె. మళ్ళా విజిల్ గుండెలమీద సమ్మెటపోటు లాగ.

"ఆల్‌రైట్ మిష్టర్ రమేష్! మీ హెల్ప్‌ని ఈ జన్మలో మరువ లేను. లాస్ట్ ఆఫ్ థాంక్స్ అండ్ ఐ విష్ యు ఎ గ్రాండ్ సక్సెస్ ఇన్ యువర్ ఎగ్జామ్స్" అంటోందామె. ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా, కృతజ్ఞతగా. కాని తను ఆమె కళ్ళల్లోకి సూటిగా చూడలేక పోతున్నాడు- ఏదో తప్పుచేసినట్లుగా దోషిగా ఫీలౌతున్నాడు. ఆ తప్పును ఆమె తెలుసుకుం దేమోననే భయం. ఆమె కళ్ళల్లోకి స్వచ్ఛంగా, సూటిగా చూడనీయటం లేదు రైలు కదులుతున్నది—

ఆమె నవ్వుతోంది విషాదంగా, అపురూపంగా కన్పించింది, ఇంత వరకు చూడని ఏదో ఆకర్షణ, ఏదో రామణీయతలో ఆమెలో ఆ క్షణంలో చూశాడు. కాని తనోఫూల్. ఆమెని పోగొట్టుకున్నాడు—

"గుడ్‌బై మిష్టర్ రమేష్ వస్తాను" అంటోంది అతిదీనంగా. నిశ్చలంగా నిల్చుండి పోయాడు గుండెల్ని చీల్చుకొని మాట పెగిలిరాదు. గుండె గొంతుకలోన కొట్లాడుతుంది, వెళ్ళిపోతోంది. నాలుగు గంటల్లో తనని ఊగించి, వేధించి, మత్తెక్కించి, తనలో యెన్నో, టెక్నికలలని సృష్టించి, కొత్తభావాలను, ఉత్త ఊహలని రేకెత్తించి, నిద్రిస్తున్నకోర్కె-

లని ఉధృతంచేసి, ఏడిపించి, నవ్వించి, చివరకు ఏమీ మిగల్చకుండా తనని కొల్లకొట్టుకొని పోతోంది. తనేమి మాట్లాడలేకబోతున్నాడు. గుండెలు బరువెక్కాయి. గొంతంతా పూడుకు పోయింది. కన్నులు శ్రావణ మేఘాలౌతున్నాయి. రైలు దూరమౌతోంది. ఆమె దస్తీ ఊపుతోంది. తను యింకా యింకా జడునిలా నిల్చుండి పోతున్నాడుకదలలేదు. ఆమెకువీడ్కోలుచెప్పలేదు- ఆమె కన్నుల్లోకి సూటిగా చూడలేదు-ఉన్నట్లుండి వేగంగా పరిగెత్తుతున్నాడు. ఏదో కొత్తరకం కొత్తజీవం, కొత్తశక్తి తనని ఆవేశించాయి. రైలుతో పోటీగా పరుగెత్తుతున్నాడు ఆమెనందు కున్నాడు.

"మిస్ మేరీ ఐ విష్‌యూ ఎ హాపీ జర్నీ వెరీ హాపీ జర్నీ విషు యూ హాపీ టైమ్ మీతోగడిపిన ఈ నాలుగు క్షణాలను ఈ జన్మలో మరచి పోలేను. నో హాపీ జర్నీ" రైలు తనని దాటిపోయింది. ఇంకా పరుగెత్తుతూనే ఉన్నాడు; దూరంగా ఆమె దస్తీ ఊపుతోంది. దూరంగా ఇంకా దూరంగా శూన్యం, అంతా అదృశ్యం అయిపోయింది.